RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 259 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 అక్టోబర్ 2024 శనివారం పేజీలు : 4

## కొవిడ్ అక్రమాలపై విచారణ..

బెంగళూరు: బీజేపీ పాలనలో కొవిడ్ అక్రమాలపై సిట్ తోపాటు మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలన కేబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన మంత్రివర్గ భేటీ జరిగింది. కేబినెట్‌లో తీర్మానాలను రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వెల్లడించారు. 16 అంశాలపై కేబినెట్‌లో చర్చించినట్లు ఆయన తెలిపారు. కొవిడ్ పరిధిలో అవినీతికి సంబంధించి దర్యాప్తునకు కేబినెట్ సబ్‌కమిటీతోపాటు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొవిడ్‌వేళ వస్తువుల కొనుగోళ్లకు సంబంధించి నియమించబడిన న్యాయమూర్తి మైఖేల్ డి కున్హా కమిషన్ 2024 ఆగస్టు 31న సమర్పించిన నివేదికపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించామన్నారు. కమిషన్ 11 సంపుటలతో నివేదిక ఇచ్చిందన్నారు. 7,223.64 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తేల్చిందన్నారు.




## హైడ్రా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం తగదు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: అర్టికల్ 370 విషయంలో పునరాలోచన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు. పదేళ్ల భాజపా పాలనలో భారతదేశం అంతర్జాతీయంగా బలపడుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు వెలిశాయని.. 40ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటున్న వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అన్ని వసతులు కల్పించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. “మూసీ పరివాహక ప్రాంతాల్లో ధనవంతులు ఎవరూ లేరు. పేద ప్రజల ఇళ్లను కూల్చేముందు వాళ్లతో చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లాలి. డ్రైనేజీ వ్యవస్థ అంతా మూసీలోనే కలుస్తోంది.. దానికి ప్రత్యామ్నాయం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమవుతుంది? రూ.లక్షన్నర కోట్లతో సుందరీకరణ చేస్తామంటున్న ప్రభుత్వం.. అ నిధులను ఎక్కడి నుంచి సమీకరిస్తుంది? కూల్చివేతల విషయంలో హైడ్రా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం తగదు. సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తే బ్యాంకు రుణాలు ఎవరు చెల్లిస్తారు?” అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

## హైదరాబాద్ రోడ్లన్నీ ఖాళీ.. ఎందుకంటే

హైదరాబాద్ : దసరా పండగ వేళ.. భాగ్యనగరం నిర్మానుష్యంగా మారింది. పండగ కోసం నగర ప్రజలు స్వస్థలాలకు వెళ్లారు. దీంతో నగరంలోని రహదారులన్నీ బోసిపోయాయి. అలాగే నగరంలోని ఆర్టీసీ బస్సులు సైతం ప్రయాణికులు లేకుండా ఖాళీగా తిరుగుతున్నాయి. దసరా పండగ నేపథ్యంలో వరుసగా సెలవులు రావడంతోపాటు నగర జీవులు.. వారి వారి స్వస్థలాలకు పయనమయ్యారు. మరోవైపు నవరాత్రుల్లో ప్రధాన పండగలు దుర్గాష్టమి, నవమి, దశమిలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి. దీంతో బుధవారమే హైదారబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు ప్రజలు పయనమయ్యారు. దాంతో రైళ్లు, బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఇక హైదరాబాద్ నగరం నుంచి వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. అలాగే దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఇంకోవైపు విజయవాడ, బెంగళూరు, వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా వద్ద బస్సులు, ప్రైవేట్ వాహనాలు భారీగా బారులు తీరాయి. మరోవైపు రైళ్లలో, ఆర్టీసీ బస్సుల్లో రిజర్వేషన్లు లేకపోవడంతో ప్రయాణికులు.. ప్రైవేట్ బస్ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ బస్ సర్వీస్ ఆపరేటర్లు టికెట్ రేట్లను భారీగా పెంచేశారు. దీంతో తప్పని సరి పరిస్థితుల్లో ప్రయాణికులు.. ప్రైవేట్ బస్సును ఆశ్రయిస్తున్నారు. మరోపైపు దసరా నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఇవి ఈ నెల 14వ తేదీతో ముగియనున్నాయి. దాంతో నగరాన్ని విడిచి వెళ్లిన వారంతా మంగళ, బుధవారాల్లో మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణం కానున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలోని రహదారులు మళ్లీ ప్రయాణికులతో కిక్కిరిసిపోనుంది. మరోవైపు పండగ వేళ.. ఇళ్లకు తాళాలు వేసి అంతా ఊర్లకు వెళ్లపోతున్నారు. ఈ నేపథ్యంలో దొంగలు హల్‌చల్ చేసే అవకాశముంది. ఎందుకంటే.. గతేడాది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో




భారీగా చోరీ కేసులు ఈ సమయంలోనే నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నగరంలోని మూడు కమిషనరేట్ పరిధిలో పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులోభాగంగా నైట్ పెట్రోలింగ్ పెంచారు. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, వ్యక్తిగత గృహాలపై నిరంతరం నిఘా పెట్టారు. అలాగే గతంలో చోరీల కేసులో అరెస్టయి.. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తుల కదలికలపై సైతం పోలీసులు గమనిస్తున్నారు. ఇక గతేడాది ఏ ప్రాంతాల్లో చోరీలు అధికంగా జరిగాయో గమనించిన పోలీసులు.. ఆయా ప్రదేశాల్లోని ప్రజలు అప్రమత్తం చేశారు. ఆ పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే.. వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. అదే విధంగా ఆ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను సైతం నిరంతరం పర్యవేక్షించేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

## ఆ దిశగా తెలంగాణ సర్కార్ అడుగులు



## 5 వేల పాఠశాలలను మూసేసిన కేసీఆర్...

## సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా పాఠశాలలను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మూసేయించారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గులో శుక్రవారం రేవంత్ పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. “దసరా నాలుగు కోట్ల ప్రజలకు సుఖ శాంతులు ఇవ్వాలని కోరుకుంటున్న. ప్రభుత్వం ఏర్పడిన రోజునే వాగ్దానం చేశాం. రాష్ట్రాన్ని విద్యా, వైద్య రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని చెప్పాం. బీఆర్ఎస్ సర్కార్ ఐదు వేల పాఠశాలలను మూసివేసి.. అణగారిన వర్గాలకు విద్యకు దూరం చేసింది. అందుకే ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్యను అందించాలని అనుకున్నాం. అందుకే విద్యా శాఖలో సంపూర్ణంగా మార్పులు చేశాం. కోరుకున్న విధంగా బదిలీలు జరిపాం. ఏ చిన్న పొరపాటు లేకుండా 21 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి ఇచ్చాం. అధికారులతోనే ఇది సాధ్యపడింది. ఏడు లక్షల కోట్ల అప్పు చేసిన కేసీఆర్ ఏనాడూ విద్యాభివృద్ధికి కృషి చేయలేదు. పేదలు చదవకూడదన్నది వారి ఉద్దేశం. %ూం% నరసింహారావు 1971 లో గురుకుల విద్యా వ్యవస్థను తెచ్చారు. అందులో చదివిన ఎంతోమంది నిరుపేదలు పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన గురుకులాల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా. కనీస వసతులు కల్పించలేదు. ఈ విషయాలు నగ్న సత్యాలు. వీటిని బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అంటే నాకు గౌరవం.. మీరు ఎక్కడ ఉంటారో మీ ఇష్టం. కానీ మీరు కూడా పేదలకు విద్య అవసరం లేదని అనుకుంటున్నారా. బీసీ, ఎస్సీ, ఎస్టీలు.. కుల వృత్తులకే పరిమితం కావాలా. పిల్లలకు చదువు చెప్పడం, పేదలకు వైద్యం అందించడం మా విధానం. మీ విధానం, మీరు సీఎం కావడం, కొడుకు, అల్లుడిని మంత్రిని చేయడం, మరొకరిని ఎంపీని చేయడం. వాళ్లందరినీ ఓడించినా బుద్ధి మారలేదు. పేదలందరికీ నాణ్యమైన విద్యనందించేందుకే రెసిడెన్షియల్ పాఠశాలలు పెడుతున్నాం. బీఆర్ఎస్ నేతలకు వారి పార్టీ కార్యాలయాలకు భూమి ఉంటుంది కానీ, బడులు కట్టడానికి భూమి, నిధులు ఉండవు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు వేర్వేరు పాఠశాలలుంటే వారిలో కల్మషాలు పెరగవచ్చు. కనుక అందరినీ ఒకే దగ్గర చదివిస్తే సోదర భావం పెరుగుతుందని ఇలాంటి సమీకృత పాఠశాలలను కట్టాలనే ఆలోచన వచ్చింది” అని రేవంత్ పేర్కొన్నారు.




## తెలంగాణలో పూర్వ వైభవం దిశగా...

# ఆచి..తూచి... అడుగులు!!

## పక్కాగా ‘స్కెచ్’ గీస్తున్న పార్టీ అధినేత!

హైదరాబాద్ : తెలంగాణలో మళ్లీ తెలుగు దేశం పార్టీనీ పట్టాలెక్కించాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యూహాలు రచిస్తున్నారు. ఏపీలో అధికారంలోకి రావడంతో తెలంగాణ శ్రేణుల్లో ఎక్కడ లేని జోష్ కనబడుతుంది. తెలంగాణలో కూడా పార్టీకీ మళ్లీ పూర్వపు వైభవాన్ని తీసుకురావాలని తెలంగాణ టీడీపీ శాఖ అధినేత చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తుంది.అడపదడపా హైదరాబాద్ కు వస్తున్న చంద్రబాబుతో తెలంగాణ నేతలు పెద్ద సంఖ్యలో భేటీ అవుతున్నారట. బాబు హైదరాబాద్ కు వస్తుందన్న సమాచారం తెలియగానే నేతలు చేసే హడావుడి అంతా ఇంతా ఉండడం లేదట. బాబును కలవడానికి పెద్ద సంఖ్యలో నేతలు ఆయన నివాసానికి క్యూ కడుతున్నారు. దీంతో నేతల రాకతో హైదరాబాద్ లోని చంద్రబాబు నివాసం సందడిగా మారుతుందట. ఇప్పటికే ఒక వైపు ఏపీలో చంద్రబాబు క్షణం తీరిక లేకుండా పాలనా వ్యవహారంలో తలామునకలై ఉంటున్నారు. అలాంటి చంద్రబాబు వ్యక్తిగత పని మీద హైదరాబాద్ కు వస్తే ఇక్కడకూడా నేతల హడావుడ తప్పడం లేదు. ఏపీలో టీడీపీ గెలిచాక తెలంగాణలో కూడా పార్టీనీ బలోపేతం చేయాలనే డిమాండ్ పార్టీ శ్రేణుల నుంచి బలంగా వినిపిస్తుంది. దీంతో హైదారాబాద్ కు వచ్చిన ప్రతి సారి చంద్రబాబుకు టీటీడీపీ నేతల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుందంట. చంద్రబాబు కూడా తెలంగాణలో పార్టీనీ బలోపేతం చేయాలని ఆలోచనలో ఉన్నాడు . కానీ అదే సమయంలో ఏపీలో సీఎంగా బిజీగా ఉండడం వల్ల తెలంగాణ శాఖ వ్యవహారాలు కాస్తా ఆలస్యం అవుతున్నాయి. గత పదేళ్లుగా తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉండడం. దీంతో పాటు మెజార్టీ టీడీపీ నేతలు బీఆర్ఎస్ లోకి వెళ్లడంతో తెలంగాణ టీడీపీ పూర్తిగా బలహీనంగా మారింది. ఒకానొక దశలో అసలు ఎన్నికల్లో పోటీ చేయలేని దుస్థితికి కూడా టీటీడీపీ చేరింది. ఎప్పుడైతే ఏపీలో అధికారంలోకి రావడం అదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి చెందడం టీటీడీపీ కాస్త ఆశలు చిగురించాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో టీటీడీపీనీ తిరిగి పునరుద్దరించినట్లైతే పార్టీ బలంగా మారుతుందని కొందరు నేతలు చంద్రబాబు దృష్టికి తెస్తున్నారట. అంతే కాదు త్వరలో జీహెచ్ ఎంసీ ఎన్నికలు రాబోతున్నాయి. టీ టీడీపీ బలపడటానికి ఇదే సరైన సమయం అని నేతలు భావిస్తున్నారు. మరొక ఆస్తికర అంశం ఏంటంటే చంద్రబాబును టీడీపీ నేతలతో పాటు ఇతర పార్టీ నేతలు కూడా కలవడం రాజకీయంగా సంచలనంగా మారుతుంది. గతంలో టీడీపీలో పనిచేసి ప్రస్తుతం ఇతర పార్టీలో ఉన్న నేతలు కూడా చంద్రబాబును కలవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని సమాచారం.ఇటీవల చంద్రబాబును పలువురు బీఆర్ఎస్ నేతలు కలిశారు. ఆ నేతలు అందరూ కూడా గతంలో చంద్రబాబుతో కలిసి పనిచేసిన వారు కావడం విశేషం. ఇప్పుడు ఈ నేతలు చంద్రబాబును కలవడంపై తెలంగాణ రాజకీయాల్లో హాట్ హాట్ గా చర్చ నడుస్తుంది. వారు త్వరలో తిరిగి టీడీపీ తీర్థం పుచ్చుకోబోతారని జోరుగా ప్రచారం నడుస్తుంది. ఇటీవల అలా కలిసిన నేతల్లో కొందరు చంద్రబాబు ముందు కొన్ని డిమాండ్లు పెట్టారని వినికిడి. తమకు తెలంగాణ అధ్యక్షుడి బాధ్యతలు అప్పగిస్తే పార్టీనీ అన్ని రకాలుగా ముందుండి నడిపిస్తామని చంద్రబాబు ముందు ప్రతిపాదన పెట్టారట. దీంతో చంద్రబాబు కూడా ఆలోచనలో పడ్డారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత మూడు నాలుగు నెలలుగా టీడీపీ అధ్యక్షుడి ప్రకటన పెండింగ్ లో ఉంటూ వస్తుంది. దీంతో ఆశావాహులు చంద్రబాబును కలిసి తమకే ఆ అవకాశం ఇవ్వాలని వినతి పత్రాలు ఇస్తున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి చంద్రబాబును కలిశారు. తాను త్వరలో తెలుగుదేశంలో చేరబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తెలంగాణలో టీడీపీనీ బలోపేతం చేస్తామని కూడా ప్రకటించారు. ఐతే తీగల కృష్ణారెడ్డికి చంద్రబాబు నుంచి పెద్ద హామీ ఏదో లభించిందని పార్టీలో గుసగుసలు వినపబడుతున్నాయి. అంతే కాదు తీగల కృష్ణారెడ్డికి తెలంగాణ టీడీపీ శాఖ అధ్యక్షుడిగా చంద్రబాబు హామీ ఇచ్చారా అన్ని చర్చ కూడా పార్టీలో తెగ జరుగుతుంది. గతంలో హైదరాబాద్ నగర మేయర్ గా పనిచేసిన అనుభవం ఉన్న తీగలకు అధ్యక్షుడుగా బాధ్యతలు ఇస్తే బాగుంటుందని బాబు ఆలోచనగా తెలుస్తుంది. అంతే కాదు ఆర్థికంగా కూడా తీగల చాలా బలంగా ఉన్నాడు. పార్టీనీ నడిపించగ సమర్థుడు అనేది బాబు ఆలోచనగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తీగల కృష్ణారెడ్డికే అధ్యక్షుడి పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పార్టీలో చర్చ జోరందుకుంది. వీరితో పాటు పలువురు ముఖ్య నేతలు కూడా చంద్రబాబును కలిశారట. అందులో సెటిలర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కూడా చంద్రబాబును కలిసి అధ్యక్షుడి ప్రతిపాదన తెచ్చారట. కానీ చంద్రబాబు నుంచి సరైన స్పందన రాలేదట. ఐతే తెలంగాణ తెలుగుదేశం వ్యవహారాలకు సంబంధించి చంద్రబాబు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని అతి త్వరలోనే పార్టీ నేతలతో సమావేశమై పార్టీ భవిష్యత్తు ప్రణాళికపై స్పష్టత ఇస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వ వ్యవహారాల్లో బిజీగా ఉండడం వల్ల కొంత సమయాన్ని కేటాయించడం లేదని త్వరలో టీటీడీపీ కూడా సమయం కేటాయిస్తామని చంద్రబాబు పార్టీ నేతలకు చెప్పారని సమాచారం. ఈలోగా పార్టీలోకి వస్తారనుకుంటున్నవారితో చర్చల ప్రక్రియ కొనసాగించాలని బాబు అనుకుంటున్నారట. చేరికలను కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని బాబు అనుకుంటున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లలోపే తెలంగాణ టీడీపీనీ ఒక గాడిలోకి పెట్టాలన్నది బాబు ఆలోచనట.

ఆ తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే దాని ప్రభావం తెలంగాణ మొత్తం ఉంటుందని. పార్టీ శ్రేణులు కూడా మరింత ఉత్సాహంగా పని చేస్తాయనేది బాబు వ్యూహమట. ఒక్కసారి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటితే ఇక తెలంగాణలో మరింత దూకుడుగా వెళ్లవచ్చు అనేది బాబు భావిస్తున్నారని సమాచారం. ఇలా మొత్తానికి తెలంగాణ టీడీపీ నేతలు చంద్రబాబుపై కోటి ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబు నిర్ణయం కోసం తెలంగాణ నేతలు ఎదురు చూస్తున్నారట. ఒక్క సారి బాబు నిర్ణయం తీసుకున్నాక పార్టీనీ ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళుతామని నేతలు చెబుతున్నారు. మరి చంద్రబాబు ఆ నిర్ణయం ఎప్పుడు తీసుకుంటారు..? టీటీడీపీ ఎప్పుడు యాక్టివ్ గా మారుతుందో అనేది మాత్రం వేచి చూడాలి.

# సంపాదకీయం

## అనవసరం జగన్.. ఈ లొల్లి..!

ఉన్న సమస్యలు చాలవన్నట్టుగా మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ కొత్త విమర్శలను, కొత్త వివాదాలను భుజాలపై ఎత్తుకుంటున్నారు. దీనివల్ల ఆయన మరింతగా రాజకీయ వర్గాల నుంచి విమర్శలు ఎదుర్కొనడంతోపాటు.. కీలక పార్టీల నేతలకు కూడా టార్గెట్ అవుతున్నారు. తాజాగా హరియాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు-ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు పోలుస్తూ.. ఈవీఎంలపై అనుమానం వ్యక్తం చేశారు. అయితే.. రాజకీయంగా జగన్ ఉద్దేశం ఏదైనా.. ఈ వ్యాఖ్యలు ఆయనకు నెగెటివ్ అయ్యాయి. ప్రస్తుతం వైసీపీ పరిస్థితి సంక్లిష్టంగా ఉంది. ఎక్కడ ఏ చిన్న అవకాశం వచ్చినా.. పార్టీని, పార్టీ అధినేతను కూడా ఇతర పార్టీలు టార్గెట్ చేస్తున్నాయి. మరీముఖ్యంగా టీడీపీ అనేక రూపాల్లో వైసీపీని లక్ష్యంగా చేసుకుని దూకుడు ప్రదర్శిస్తోంది. మరోవైపు.. 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడం.. లోక్‌సభలో 4 సీట్లకే పరిమితం కావడం వంటివి జగన్‌కు ఇబ్బందిగా మారింది. ఇంకోవైపు.. రాజ్యసభ సభ్యులు ఎప్పుడు ఎవరు ఉంటారో.. ఎవరు పోతారో తెలియని పరిస్థితి కూడా ఏర్పడింది. ఇలాంటి కీలక సమయంలో గతంమరిచిపోయి.. భవిష్యత్తుపై జగన్ దృష్టి పెట్టాల్సి ఉంది. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీ నాయకత్వానికి ఆయన చేరువ కావాల్సి కూడా ఉంది. లేకపోతే.. ఇప్పటికిప్పుడు కాకపోయినా.. రాబోయే రోజుల్లో అయినా కేంద్రంలోని బీజేపీ పెద్దలు జగన్‌ను టార్గెట్ చేస్తే అప్పుడు సమీకరణలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. ఇదే జరిగితే.. వైసీపీపైనా పెను ప్రభావం పడుతుందని పరిశీలకులు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో ఈవీఎంలు, హరియాణాలో బీజేపీ విజయం, కాంగ్రెస్ ఓటమి వంటివాటిని ప్రస్తావించడం ద్వారా జగన్‌కుఏపీలో పెరిగే ఓటు బ్యాంకు అంటూ ఏమీ ఉండదు. పోనీ.. కాంగ్రెస్ పార్టీకి దన్నుగా నిలిస్తే.. అప్పుడైనా ప్రయోజనం ఉంటుందా? అంటే.. అది కూడా కష్టమనే అంటున్నారు. ఇలాంటి సమయంలో జగన్ ఆచి తూచి వ్యవహరించాలనేది మేధావుల సూచన. అలా కాకుండా..లేనిపోని విషయాలను భుజాన వేసుకుంటే అంతిమంగా నష్టపోయేది వైసీపీనేనని ఆయన గుర్తించాలి.

# తీరనున్న వన్యప్రాణుల దాహార్తి



పెద్దపల్లి : వన్యప్రాణుల దాహార్తి తీర్చడంతో పాటు భూగర్భ జలాలు పెంచేందుకు అటవీశాఖ నిర్మించిన నీటి వనరులు జలకళ సంతరించుకున్నాయి. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలు, నీటికుంటలు, ఇతర వనరులు పొంగిపొర్లుతున్నాయి. అటవీ ప్రాంతం పచ్చదనాన్ని సంతరించుకుంది. వనరుల్లోకి నీరు సమృద్ధిగా చేరడంతో వన్యప్రాణులకు తాగునీటి కష్టాలు దూరమ య్యాయి.

పుష్కలంగా భూగర్భ జలాలు

గత వేసవిలో నీటి వనరుల్లో నీరు లేక వన్యప్రాణులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తాగు నీటికోసం గ్రామాల సమీపంలోకి రావడంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడి మృత్యువాత పడ్డాయి. అడవిలో నీటి వనరుల చెంత వేటగాళ్లు బిగించిన ఉచ్చుకు బలైపోతున్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న అధికారులు కొండలు, రాళ్లగుట్టలు, వాగులు, వంకల్లో ప్రవహించే నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచేందుకు చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పూర్తిస్థాయిలో నీరు చేరడంతో వేసవిలో నీటి ఎద్దడి తీరనుందని అధికారులు భావిస్తున్నారు.

సంరక్షణతో జీవం

జిల్లాలో 31,100.368 హెక్టార్లలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో గతంలో పెద్దపులి సంచరించింది. ప్రస్తుతం జిల్లాలోని అడవుల్లో ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, జింకలు, కనుజులు, దుప్పులు, కుందేళ్ల సంచారం ఉంది. గత కొన్నాళ్లుగా అటవీ ప్రాంతాలు కబ్జాలకు గురవుతుండటంతో అధికారులు దృష్టి సారించారు. అటవీ ప్రాంతం కబ్జాకు గురికాకుండా 3 లక్షల మీటర్ల వరకు కందకం, గుట్టలు, కొండల దిగువ ప్రాంతాల్లో 25 వేల కాంటూరు కందకాలు నిర్మించారు. రూ.54.80ల వ్యయంతో 11 చెక్‌డ్యాంలు, రూ.7.80 లక్షల వ్యయంతో భారీ నీటినిల్వ తొట్లు 6 నిర్మించారు. జిల్లాలో అటవీవిస్తీర్ణం: 31,100.368 హెక్టార్లు ఉండగా 14 సెక్షన్లు, 40 బీట్లు ఉన్నాయి.

సంరక్షణతో జీవం

జిల్లాలో 31,100.368 హెక్టార్లలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో గతంలో పెద్దపులి సంచరించింది. ప్రస్తుతం జిల్లాలోని అడవుల్లో ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, జింకలు, కనుజులు, దుప్పులు, కుందేళ్ల సంచారం ఉంది. గత కొన్నాళ్లుగా అటవీ ప్రాంతాలు కబ్జాలకు గురవుతుండటంతో అధికారులు దృష్టి సారించారు. అటవీ ప్రాంతం కబ్జాకు గురికాకుండా 3 లక్షల మీటర్ల వరకు కందకం, గుట్టలు, కొండల దిగువ ప్రాంతాల్లో 25 వేల కాంటూరు కందకాలు నిర్మించారు. రూ.54.80ల వ్యయంతో 11 చెక్‌డ్యాంలు, రూ.7.80 లక్షల వ్యయంతో భారీ నీటినిల్వ తొట్లు 6 నిర్మించారు. జిల్లాలో అటవీవిస్తీర్ణం: 31,100.368 హెక్టార్లు ఉండగా 14 సెక్షన్లు, 40 బీట్లు ఉన్నాయి.

నిఘా పెంచుతున్నాం

– శివయ్య, జిల్లా అటవీశాఖ అధికారి

జిల్లాలో అడవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో వన్యప్రాణుల దాహార్తితోపాటు భూగర్భ జలాలు పెంచేందుకు చెక్‌డ్యాంలు, నీటి తొట్ల నిర్మాణాలు చేపట్టాము. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు సమృద్ధిగా చేరింది. వన్యప్రాణులకు నీటి కష్టాలు తీరాయి. అడవి జంతువులు వేటగాళ్ల బారిన పడకుండా నిఘా పెంచుతున్నాం.

# వసతి గ్రహణం



సిరిసిల్ల : బోధనతోపాటు ఆవాసాన్ని కల్పించే వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆశ్రమాల పరిసరాలు పిచ్చిమొక్కలతో విష సర్పాలకు నివాసాలవుతున్నాయి. చిన్న చిన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోక బాలబాలికలకు శాపంగా మారుతున్నాయి.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలతోపాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల వసతి గృహాల్లో సుమారు ఆరు వేల మంది విద్యార్థులు ఉన్నారు. చాలా చోట్ల ఊరికి దూరంగా ఉన్నాయి. వనాలకు చేరువ, పొలాల మధ్య ఏర్పాటు చేయడంతో విష సర్పాలు తిరుగుతున్నాయి. దీనికి తోడు మైదానం, భవనాలు, కిటికీల వరకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.

పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం జిల్లాలో సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాం. సిబ్బంది హాజరు, భోజన నాణ్యతను పరిశీలిస్తున్నాం. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులను నియమించాం. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, లేదా, పరిశుభ్రత పాటిస్తున్నారా, లేదా పరిశీలిస్తున్నాం. ఎక్కడైనా సమస్యలున్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల వసతి గృహాల పరిసరాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఆదర్శ వసతి గృహంలో కిటికీల వరకు పెరిగాయి. సర్పాలు కిటికీల గుండా లోనికి వెళ్లే అవకాశాలు ఉండటంతో బాలికలు భయంగా గడుపుతున్నారు మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఇరుకు గదులతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో బాలికలు నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల జ్వర పీడితులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయలేదు. తీవ్ర అనారోగ్యానికి గురైతే తల్లిదండ్రులకు సమాచారమిచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

కేజీబీవీలో 200 మంది పైగా బాలికలు ఉన్నారు. కిటికీల తలుపులు ఊడిపోవడంతో చలి, వర్షపు చినుకులు గదిలోకి వస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు గదులు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి గురుకుల పాఠశాలను అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో కొనసాగుతుంది. చిన్న చిన్న గదుల్లో ఒక డార్మెటరీపై నలుగురు విద్యార్థులు నిద్రిస్తున్నారు. గ్రీజర్ లేకపోవడం వల్ల చల్లని నీటితో స్నానం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల చుట్టూ పొలాలు ఉండటంతో విష కీటకాలు లోపలికి వచ్చే ప్రమాదం ఉంది.

# శునకాల నియంత్రణ ఏదీ?

పెద్దపల్లి: వీధి కుక్కల సంతతి నియంత్రణకు కార్యాచరణ తూతూమంత్రంగా జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. వీటి కారణంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టాలంటే జంకే పరిస్థితి నెలకొంది. శునకాల సంతతి నియంత్రించేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గ్రామాలు, పట్టణాల్లో జంతు సంతతి నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి శునకాల గణన చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 11,748 పెంపుడు, 35,990 వీధి కుక్కలు కలిపి మొత్తం 47,738 ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. వీటి సంతతి పెరగకుండా చేపడుతున్న చర్యలను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్‌తో ప్రస్తావించగా... నగరపాలక, పురపాలికలతో పాటు పంచాయతీరాజ్ శాఖ సహకారంతో త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యుల కొరత ఉండటంతో ప్రక్రియ సాఫీగా సాగడం లేదని.. ఇతర రాష్ట్రాల నుంచి పశువైద్యులను రప్పించి త్వరలో చర్యలు చేపడతామన్నారు.

పెరుగుతున్న బాధితులు



కుక్కల బెడద పెరిగిపోవడంతో తరచూ జిల్లావ్యాప్తంగా ఎక్కడో ఒకచోట ప్రజలు కుక్కకాటు బారిన పడుపతున్నారు. గడచిన మూడు నెలలుగా కుక్కకాటుతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందినవారు 246 మంది ఉన్నారు. దాదాపు 235 వరకు మూగజీవాలను సైతం ఇవి గాయపరిచాయి. ఒక్కో శునకానికి శస్త్రచికిత్స చేసేందుకు రూ.1600 వరకు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. జంతుసంతతి నియంత్రణ కేంద్రం(ఏబీసీ సెంటర్) ఏర్పాటు చేసి శునకాలకు శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా ఇంకా ప్రక్రియ ప్రారంభం కాలేదు. జిల్లావ్యాప్తంగా వీధుల్లో గుర్తించిన శునకాలను ఈ కేంద్రానికి తీసుకువచ్చి శస్త్రచికిత్స చేసి అనంతరం వదిలేయాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా పశువైద్యులు అందుబాటులో లేకపోవడంతో శునకాలకు ఎలా శస్త్రచికిత్స నిర్వహించాలో అధికారులకు అంతుచిక్కడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి శునకాల బారినుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధి వేట ..ముళ్ల బాట

జగిత్యాల : జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వినోద్ ఉపాధి కోసం బెహరాన్ వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. అక్కడ ఎవరూ సహకరించకపోవడంతో పాటు గుర్తుతెలియని వారు దాడి చేయడంతో చేయి విరిగింది. అక్కడే అనారోగ్యం పాలై మానవతావాదుల సాయంతో ఇల్లు చేరాడు. రోజురోజుకూ ఆరోగ్యం మరింత క్షీణించి రెండ్రోజుల కిందట మృతిచెందాడు. వినోద్ లాగే చాలా మంది అభాగ్యులు కంపెనీ నిబంధనలు పాటించకుండా చిక్కుల్లో పడుతున్నారు. ఇబ్బందులు ఎదురయ్యాక తమకు సాయం చేసేవారు లేరంటూ ఆవేదన చెందుతున్నారు.

సాంకేతికంగా అభివృద్ధి పెరుగుతున్నా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీసాలు, వైద్య పరీక్షల పేరిట నకిలీ ఏజెంట్లు మోసం చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాధితుల సంఖ్య పెరగడంతో జగిత్యాలలో పోలీసుశాఖ, వలసదారుల రక్షణ అధికారి(ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్), భారత విదేశాంగ శాఖ వారు అవగాహన, శిక్షణ ఏర్పాటు చేశారు. నకిలీల బారిన పడొద్దని, ఎలాంటి మోసం జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు చెబుతున్నారు. ఆర్మూరుకు చెందిన ఓ ఏజెంటు వైద్య పరీక్షలు చేయించి పలువురిని దుబాయి పంపగా అవి చెల్లవని చెప్పడంతో ఆర్మూరు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి అక్కడి కంపెనీల నిబంధనల మేరకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉండగా చాలా మంది ఏజెంట్లు తమకు అనుకూలమైన డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు చేయించి పంపుతున్నారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకోకుండా అక్కడికి వెళ్లి తీరా కంపెనీలు పరీక్షలు చేయించడంతో అనారోగ్య సమస్యలు బయటపడి స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు.

ఫిర్యాదులకు అవకాశం

జగిత్యాలలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో రాయబార కార్యాలయ అధికారులు కూడా ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడి కంపెనీల్లో సదరు ఏజెంటు చెప్పిన జీతభత్యాలు, ఉపాధి లేకపోతే భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఏజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీలు, కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తోంది. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా కంపెనీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో గల్ఫ్ సంక్షేమ సంఘాల సహకారంతో కంపెనీపై ఫిర్యాదు చేశాడు. దీంతో కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.

నకిలీలతో ఇబ్బందులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు 33 మంది మాత్రమే ఉన్నారు. గల్ఫ్ ఏజెంట్లు ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 నిబంధనలకు లోబడి పనిచేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీల వివరాలు, జీతభత్యాలు ఏజెంట్లు తెలపాలని సూచిస్తున్నారు. గల్ఫ్ వెళ్లాలనుకుంటున్న వారు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1800113090 74283 21144ను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన ధ్రువపత్రాలు పరిశీలించి అభ్యర్థులను గల్ఫ్ దేశాలకు పంపాలని పోలీసులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లైసెన్స్ పొందాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బాధితులు సంప్రదిస్తే చర్యలు

గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లేవారు మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ ఏజెంట్ల బారిన పడి మోసపోవద్దు. బాధితులు నేరుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నకిలీ ఏజెంట్లపై కేసులు కూడా నమోదు చేశాం. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సాయం అందుతుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్‌లోని సమగ్ర సమాచారాన్ని పరిశీలిస్తే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.– అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

# ప్రాథమిక విద్య.. వారికి మిథ్య

ఆసిఫాబాద్ : మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే అంతంత మాత్రంగా నడిచే గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరొకరు అక్కడికి రాకపోవడంతో బడులన్నీ మూతపడ్డాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలకు చాలాచోట్ల ఉపాధ్యాయుల హాజరు అత్యంత తక్కువగా ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు అన్ని మండలాల పరిధిలో ఎస్ఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)లను నియమించారు. కొందరు ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఎస్ఆర్పీలను కొన్ని చోట్ల మారుమూల ప్రాంతాల్లో తమకు అనుకూలంగా మలుచుకుని పాఠశాలలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో పాఠశాలలు రోజుల తరబడి మూతపడే ఉంటున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బాబేఝరి పంచాయతీలోని చిత్తగూడ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారు. పక్షం రోజుల నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు.

ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ ఉపాధ్యాయుడు లేరు. సిరికొండ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సైతం ఉపాధ్యాయుడు లేక మూతపడే ఉంటుంది.

గోవెన గొండుగూడ పాఠశాల

కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలో జెండగూడ, బొజ్జుగూడ, గోపెర, నాగగూడ గోపెర, గోవెన గోండుగూడ, కుర్సిగూడ, పాడిగూడ, కుంటగూడ, తాళ్లపేటగూడ, అర్జున్‌లొద్ది గ్రామాల్లో పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తెరుచుకోవడం లేదు.

43 పాఠశాలల మూత' కథనం ప్రచురితం కాగా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్పందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ అధికారులతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన చోట, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల వివరాలను సేకరించి, ఆయా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్పీలను వెంటనే సర్దుబాటు చేయాలని ఆయా జిల్లాల గిరిజన సంక్షేమాధికారులను ఆదేశించారు.సర్దుబాటుతోపాటు విద్యను అందించాలి

మూతపడిన పాఠశాలలకు వారం అనంతరం ఉపాధ్యాయులు వెళతారని అధికారులు అంటున్నారు. సర్దుబాటు చేసిన వారితోపాటు, మిగతా ఏకోపాధ్యాయ పాఠశాలలు సక్రమంగా నిత్యం తెరుచుకునే విధంగా ఐటీడీఏ అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వీటి పర్యవేక్షణ కోసం నియమించిన సీఆర్పీల ద్వారా పక్కాగా నివేదికలు అందేలా చూడాలి.

# తపాలా సేవ.. సాంకేతిక తోవ

మిర్యాలగూడ : ఒకప్పుడు ఉత్తరాల బట్వాడాకే పరిమితమైన తపాలా శాఖ, మారుతున్న కాలానికనుగుణంగా అనేక అధునాతన సేవలు అందిస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకుంటూ ఖాతాదారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే పోటీని తట్టుకునేందుకు సిబ్బందిని సైతం సిద్ధం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతుంది. తక్షణ సేవలు..ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్, నల్గొండ, భువనగిరిలో పోస్టల్ పేమెంట్స్ బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలంటే సమయాభావంతో ప్రజలు అనేక ఇబ్బందుడు పడుతున్నారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ సిబ్బందికి 5జీ చరవాణులు అందించి ఇంటి వద్ద కానీ, కార్యాలయంలో కానీ రెండే నిమిషాల్లో ఖాతా తెరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నల్గొండ డివిజన్‌లో 358, సూర్యాపేట డివిజన్‌లో 318 చరవాణులు పంపిణీ చేయగా.. తాజాగా సూర్యాపేట డివిజన్‌లో సిబ్బందికి మినీ ముద్రణ యంత్రాలను సైతం అందించారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 12 వరకు తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నారు. కొనసాగుతున్నవి..



ఇక తపాలా శాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పలు పథకాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. వీటిలో ముఖ్యమైనవి సుకన్య సమృద్ధి యోజన పథకంతో పాటు రూ.399, రూ.499 ఏడాది ప్రీమియంతో అందించే రూ.10లక్షలు, రూ.15లక్షల బీమా పథకాలతో పాటు బాల ఆధార్, తపాలా కార్యాలయాల్లో ఆధార్ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

వీటితో పాటు మహిళ ఆర్థిక అభ్యున్నతికి ప్రవేశ పెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం, పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక స్వావలంభన అందించేందుకు వడ్డీ రేట్ల పెంపు వంటివి సైతం ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలువెంకటేశ్వర్లు, తపాలా సూపరింటెండెంట్, సూర్యాపేట డివిజన్

ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది 150 ఏళ్ల థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నాం. వీటిలో ప్రధానంగా విద్యార్థులకు ఉత్తరాల ప్రాముఖ్యత, చరిత్రను వివరించేందుకు క్విజ్, వ్యాసరచన పోటీలతో పాటు బాలికా సాధికారత కోసం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించనున్నాం. వీటితో పాటు అన్ని తపాలా కార్యాలయాల్లో ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నాం.

# ఆపద్బాంధవులు ఈ జాలర్లు

ధర్మపురి : జిల్లాలోని రాయపట్నం గోదావరి తీరంలో స్నానాలు చేసేందుకు నిత్యం వేలాదిమంది భక్తులు వస్తూ.. లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమయంలో క్షణాల్లోనే వీరిని అక్కడున్న జాలర్లు ప్రాణాలకు తెగించి కాపాడుతున్నారు. ఇటీవల రాయపట్నం వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు కొట్టుకుపోగా.. వారిలో ఇద్దరిని ప్రాణాలకు తెగించి కాపాడారు. ఇలా రాయపట్నం వద్ద చేపలను పట్టే మత్స్య కార్మికులు ప్రాణ రక్షకులుగా నిలిచారు.

ప్రమాద సూచికలు లేకపోవడంతో..

ఇక్కడ ఎల్లంపల్లి నిలువ నీరు భారీగా ఉంటోంది. దీంతో పురాతన వంతెన ఎప్పుడూ మునిగి ఉంటుంది. ప్రమాద సూచికల బోర్డులు లేకపోవడంతో నేరుగా నదిలోకి స్నానానికి దిగుతున్నారు. లోతు భారీగా ఉండటంతో వరద నీటి ప్రవాహంలో కొట్టుకుని పోతున్నారు. ఇప్పటివరకు 50 మందికిపైగా రక్షించామని చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చి..

కృష్ణా జిల్లా కైకలూరు ప్రాంతానికి చెందిన 12 కుటుంబాల మత్స్య కార్మికులు.. ముప్పై ఏళ్ల కిందట ఉపాధి కోసం రాయపట్నానికి వలస వచ్చారు. నదీ తీరంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. మరోవైపు రాయపట్నం వద్ద వంతెన నుంచి నీటిలో దూకి ఆత్మహత్యకు



యత్నించిన వారిని క్షణాల్లోనే వారి ప్రాణాలు కాపాడుతున్నారు. ఇప్పటివరకు సుమారుగా పదేళ్లలో 50 మంది ప్రాణాలను కాపాడారు. నిండు గోదావరిలో అవలీలగా ఈతకొట్టే సామర్థ్యం కలిగి ఉన్న ఈ మత్స్య కార్మికులు.. ఈ ఏడాదిలో 5 గురుని కాపాడారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

జాలరులైన తమకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇక్కడ ఏ ఘటన జరిగినా వెంటనే రక్షిస్తున్నాం. ప్రమాదవశాత్తు ఇటీవల ప్రవాహంలో కొట్టుకుపోయిన ఇద్దరు యువకులను కాపాడాం. నదిలో దూకి ఆత్మహత్యయత్నం చేసుకున్న వారిని క్షేమంగా తీరానికి తీసుకువచ్చిన ఘటనలున్నాయి. ప్రభుత్వం తమకు గృహ నిర్మాణంతోపాటు సరిపడా ఉపాధి కల్పించాలి.

వేణుకుమార్, మత్స్య కార్మికుడు, రాయపట్నం

పలువురి ప్రాణాలను కాపాడాం

మాది కృష్ణా జిల్లా కైకలూరు. 35 ఏళ్ల కిందట రాయపట్నం వచ్చాం. ప్రమాదకర పరిస్థితుల్లో పలువురి ప్రాణాలను కాపాడాం. ఏ చిన్న ప్రమాదం జరిగినా పోలీసులకు సమాచారం అందిస్తూ.. రక్షణ చర్యలు చేపడుతున్నాం. మాకు ఆధార్, ఓటు హక్కులు ఉన్నాయి. ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలి.కోటయ్య, మత్స్య కార్మికుడు

# మద్దతు ధరపైనే ఆశలు



జమ్మికుంట : ఉమ్మడి జిల్లాలో సీజన్‌కు ముందు నుంచే కొత్తపత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. పాతపత్తి విక్రయాలు తగ్గిపోగా.. క్రమేణా కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. గత నెల 13 నుంచి జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌కు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. వరంగల్, కేసముద్రం, ఖమ్మం మార్కెట్లలోనూ కొత్తపత్తి విక్రయాలు ప్రారంభమయ్యాయి.

క్వింటాకు రూ.7,521

కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఇది ఈ నెల 1 నుంచి అమలులోకి రానుంది.

పింజ పొడవును బట్టి మధ్యస్త పత్తికి రూ.7,121గా నిర్ణయించింది. వరంగల్ రీజియన్ మార్కెటింగ్ పరిధిలో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు.

జమ్మికుంటలో కొనుగోళ్ల మొదటి రోజు రూ.7,119ల ధర పలికింది. మార్కెట్‌లో సుమారు 17 రోజుల్లో సుమారు 800 క్వింటాళ్ల కొత్తపత్తి కొనుగోళ్లు జరిగాయి. కొత్తపత్తి విక్రయాలు దసరా అనంతరం జోరు అందుకోనున్నాయి.

ప్రస్తుతం కొత్తపత్తితోపాటు నామమాత్రంగా వస్తున్న పాతపత్తిని ద్వితీయ శ్రేణి వ్యాపారులే ఖరీదు చేస్తున్నారు. అధిక తేమ శాతం, నాణ్యత లేని పత్తిని ఖరీదు చేసి యార్డులో, గిడ్డంగులు, షాపుల వద్ద ఆరబెడుతున్నారు.

మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు వీలుగా తేమశాతం ఎక్కువ ఉన్న పత్తిని ఆరబెట్టడంపై ద్వితీయశ్రేణి వ్యాపారులు దృష్టి సారించారు.

ప్రస్తుతం జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల మరమ్మతు పనులు చేపట్టామని.. దసరా తర్వాతే మిల్లుల్లో కొత్తసీజన్‌లో కొనుగోళ్లు చేపడతామని మిల్లుల వ్యాపారులు చెబుతున్నారు.

రానున్న రోజుల్లో ఎక్కువ మొత్తంలో పత్తి విక్రయానికి వచ్చే అవకాశం ఉన్నందున మద్దతు ధర కోల్పోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

తేమ లేకుండా చూడాలిజమ్మికుంట మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు క్రమేణా పెరిగాయి. పత్తి ఏరగానే నేరుగా విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో తేమ శాతం ఎక్కువ ఉంటోంది. ఈ కారణంగా ధర తగ్గుతుంది. రైతులు పత్తిని ఆరబెట్టి పెట్టి విక్రయానికి తీసుకురావాలి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిబంధనలు ఇంకా అధికారుల నుంచి రాలేదు. ఆర్.మల్లేశం, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, జమ్మికుంట

# సందిగ్ధంలో విద్యుత్తు ఉద్యోగుల బదిలీలు



భగత్‌నగర్ : విద్యుత్తు సంస్థలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ సందిగ్ధంలో ఉండిపోయింది. సోమవారం ఇవ్వాల్సిన బదిలీ ఉత్తర్వులు చివరి నిమిషంలో నిలిచిపోయాయి. మంగళవారం సైతం దీనిపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియపై ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. సాధారణంగా మూడేళ్లు సర్వీసు నిండిన వారికే బదిలీ చేపట్టేవారు. కానీ ప్రస్తుతం రెండేళ్లకు కుదించడంతో ఎక్కువ మంది బదిలీ కావాల్సి వస్తోంది. ఓ ఉద్యోగి కొత్త ప్రాంతానికి వచ్చి కుదురుకోవడానికే ఆరు నెలల సమయం పడుతుంది. అలాంటిది రెండేళ్లకు అనేది వారికి అసౌకర్యంగా మారింది. ముఖ్యంగా ఇంజినీర్లను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన సమయంలో ఆ భౌగోళిక పరిస్థితులు అవగతం కావడానికి సమయం పడుతుంది. దీనికితోడు ఆయా సెక్షన్ల పరిధిలో చేసిన అభివృద్ధి పనుల భారం అధికంగా ఉంటుంది. ఒక్కో ఇంజినీరుకు 50 నుంచి 120 వరకు వర్క్ ఆర్డర్లు ఉంటాయి. బదిలీపై వెళ్లాక వాటిని పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం పడుతుంది. ఆ ప్రాంతానికి వచ్చిన ఇంజినీరుకు ఆ ప్రాంతం అవగతం అవడానికి ఆరు నెలలు పడుతుంది. ఇలా ఇంజినీర్లకు ఇబ్బందే. ఇదే మూడేళ్ల సమయం ఉంటే వారు చివరి ఆరు నెలల్లో పనులను పూర్తి చేసుకునే అవకాశముంది.

విద్యాసంవత్సరం మధ్యలో..

మొదట ట్రాన్స్‌కోలో బదిలీ మార్గదర్శకాలు విడుదలైన తరువాత డిస్కంలలో విడుదల జేసేవారు. ప్రస్తుతం ట్రాన్స్‌కోలో బదిలీ మార్గదర్శకాలు జారీకాకుండానే డిస్కంలలో జారీ చేశారు. సాధారణంగా జూన్, జులైలలో బదిలీ నోటిఫికేషన్ జారీ చేసేవారు. ప్రస్తుతం సెప్టెంబరులో బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగుల పిల్లలకు విద్యాపరంగా ఇబ్బందులు వచ్చే అవకాశముంది.

పైరవీలకు అడ్డుకట్ట..

ప్రస్తుత బదిలీల్లో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి కొత్త విధానాన్ని తీసుకొస్తూ పైరవీలకు అడ్డుకట్ట వేశారు. గతంలో ఉద్యోగులు తాము బదిలీ కావాలని కోరుకున్న ప్రాంతాలను (ఐచ్ఛికాలను) ఆయా సంఘాల నాయకులకు ఇవ్వాల్సి వచ్చేది. ఆ విధానాన్ని సీఎండీ తొలగిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఏ ప్రాంతాలు కావాలో మూడింటిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లో తాము కోరుకున్న ప్రాంతాలు ఉద్యోగులు చూసుకునే వెసులుబాటు కల్పించారు. గతంలో ఉద్యోగి కోరుకున్నది ఒక ప్రాంతమైతే సంఘాల నాయకులు మరో చోటకు బదిలీ చేయించేవారు. ఆ ఇబ్బందిని ప్రస్తుతం తొలగించారు.

# సొంతానికి ఎక్కువ.. ఆర్థికాభ్యున్నతికి తక్కువ



కరీంనగర్ : మహిళలు ఆర్థికంగా ఎదగడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బ్యాంకు లింకేజీతో రుణాలు అందజేస్తున్నారు. గతేడాది విధించిన లక్ష్యం చేరుకోవడంతో.. రాష్ట్ర స్థాయిలో అవార్డు సైతం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 2024-25 లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. రుణాలు తీసుకున్న వారిలో అతికొద్ది మాత్రమే వ్యాపారానికి ఉపయోగించుకొని ఆర్థికాభ్యున్నతి పొందుతున్నారు. ఎక్కువ శాతం మంది సొంత అవసరాలకే వినియోగిస్తున్నారు. వారిలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు ఏటా మంజూరు చేసిన రుణాన్ని.. సొంతానికి వినియోగించుకున్న అప్పులు చెల్లించడం, ఇతరాత్ర వాటికే మహిళలు ఉపయోగించుకుంటున్నారు. సొంతంగా ఏదైనా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఆలోచన చేయడంలేదు. అతి కొద్దిమంది మాత్రమే చిన్నపాటి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మహిళలు పురోగతి సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజూరు చేసిన రుణమొత్తానికి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అవగాహన అవసరం

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపారాలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వారందరూ రుణాలు తీసుకునేలా ఏటా లక్ష్యాన్ని విధిస్తోంది. అధికారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా సభ్యురాళ్లకు రుణాలు మంజూరు చేస్తే.. అందులో కనీసం వందల్లో కూడా ఆర్థికంగా రాణిస్తున్న వారు లేకపోవడం విశేషం. ప్రస్తుతం పలు సంఘాలు ఏటా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకుంటున్నాయి.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడానికి ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి ద్వారా సొంతంగా వ్యాపారాలు నిర్వహించేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వ్యాపారాలు ప్రారంభించి లాభాన్ని అర్జించేలా అధికారులు సూచనలు చేస్తూ పర్యవేక్షించేలా చూస్తాం.శ్రీధర్, కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

# ఎదురుచూపులు ఉండవిక..!

భానుపురి: సీసీఐకి పత్తి విక్రయించిన రైతులకు ఇక నుంచి దిగులుండదు. నగదు బ్యాంకు ఖాతాలో పడే వరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వారికి ఇక నుంచి ఆ ఇబ్బందులు ఉండవు. సమయానికి నగదు జమ కాకపోవడంతో అధికారుల వద్దకు వెళ్లి వాకబు చేస్తుంటారు. ఇందుకు గ్రామాల నుంచి పట్టణంలోని కార్యాలయాలకు వెళ్లొస్తుంటారు. అటు సీసీఐ కార్యాలయాల చుట్టూ అన్నదాతలు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సీసీఐ 'కాటన్-అల్లై' పేరుతో కొత్త యాప్‌ను కొనుగోళ్ల వరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే మేలు చేకూరనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 7.18 లక్షల ఎకరాల సాగుఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈసారి 7.18 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. అంతర్జాలం వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఇంట్లో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంటోంది. సీసీఐ తీసుకొచ్చే యాప్ ద్వారా పత్తి నగదు చెల్లింపు ప్రక్రియ ఏ మేరకు వచ్చిందనే కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు వీలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల పంట దెబ్బతింది. దీంతో దిగుబడిపై రైతుల్లో దిగులు నెలకొంది. సరాసరి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు వివరాలు (ఎకరాల్లో..)సూర్యాపేట - 78,094నల్గొండ - 5,40,022 యాదాద్రి - 1,00649

# ఆ అలవాటుకు.. 25 ఏళ్లు

మిర్యాలగూడ : చిన్నతనంలో తమ ఇంటికి వచ్చే ఉత్తరాల స్టాంపులు సేకరించడం అలవాటుగా మారిన అతడికి.. చదువుకునే వయసులో బహుమతిగా వచ్చిన నేపాల్ కరెన్సీ నోటు.. వివిధ దేశాల కరెన్సీ నోట్ల సేకరణకు ప్రాణం పోసింది. దీంతో 25 ఏళ్లుగా వేలాది స్టాంపులు, నాణేలు, నోట్లు సేకరించిన అతడు.. నేటితరం చిన్నారులకు వాటి గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో తన వ్యాపార ప్రాంతంలో ప్రదర్శిస్తున్నాడు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన గరిణె ఠాగూర్.. డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. 1998లో నాలుగో తరగతి చదువుతున్నప్పుడు తన ఇంటికి వచ్చే ఉత్తరాల నుంచి స్టాంపులు సేకరించడం మొదలు పెట్టాడు. ఆ తర్వాత రెండేళ్లకు తమ ఇంటి సమీపంలోని ఓ వసతిగృహానికి కాపలాదారుగా ఉన్న నేపాల్ వ్యక్తిని వారి నగదు ఎలా ఉంటుందని అడుగగా.. అతడొక నోటును బహుమతిగా ఇచ్చాడు. దానిని మురిపెంగా చూసుకుని ఇతర దేశాల కరెన్సీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నాడు. దీంతో దీనినే తన అలవాటుగా మలచుకుని నేటి వరకు సుమారు వంద దేశాల నుంచి సేకరించిన 2వేల నోట్లు, 5వేల నాణేలు, వివిధ దేశాలకు చెందిన 4వేల స్టాంపులు సేకరించాడు. వీటితో పాటు దేశానికి చెందిన సుమారు 400 రకాల అగ్గిపెట్టెలు సైతం



సేకరించాడు. వీటి విలువ సుమారు రూ.10లక్షలకు పైగానే ఉంటుందని అంచనా.

పురాతనం నుంచి అధునాతనం వరకు..

ఠాగూర్ సేకరించిన వాటిలో పురాతన కాలం నుంచి ఇటీవలి వరకు కరెన్సీ నోట్లు, స్టాంపులు ఉన్నాయి. నిజాం నవాబుల కాలం నాటి స్టాంపులు, కరెన్సీ నోట్లతో పాటు వెండి నాణేలు, ఢిల్లీ సుల్తానుల, తమిళనాడు చోళ రాజుల, మైసూర్ టిప్పు సుల్తాన్ కాలాల నాటి నాణేలు సైతం సేకరించాడు. వీటితో పాటు ఇటీవల హాంకాంగ్, రష్యా, ఈస్ట్ కరేబియాన్, న్యూజిలాండ్, సోలోమన్ ఐలాండ్, సింగపూర్, మాల్దీవులు తదితర దేశాలు ప్రవేశ పెట్టిన పాలిథిన్ కరెన్సీ నోట్లు సైతం సేకరించాడు. వీటిలో ప్రపంచంలోనే అతి విలువైన దుబాయ్ కరెన్సీతో పాటు తక్కువ విలువైన ఇండోనేషియా కరెన్సీ నోట్లు సేకరించాడు. యుగోస్లేవియాలో పాత నోట్లు రద్దు చేసిన సమయంలో ముద్రించిన కొత్త నోట్లు సైతం ఇతడి సేకరణలో భాగమయ్యాయి. ఇండోనేషియా కరెన్సీ నోటుపై వినాయకుడి చిత్రం, క్యూబా కరెన్సీ నోటుపై చెగువెరా చిత్రం ముద్రించిన నోట్లు సైతం సేకరించి ఔరా అనిపిస్తున్నాడు.

పిల్లలకు తెలియజేయాలనే

గరిణె ఠాగూర్, మిర్యాలగూడ

తపాలా స్టాంపులు, కరెన్సీ నోట్లు, నాణేలను విక్రయించాలన్న ఆలోచన ఎప్పుడూ చేయలేదు. వాటిని పెట్టెల్లో నిరుపయోగంగా ఉంచడం కంటే.. మా దుకాణానికి వచ్చే చిన్నారులకు వివిధ దేశాల కరెన్సీ,. తపాలా స్టాంపుల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో నోట్లను టేబుల్‌పై అద్దం కింద పేర్చాను. వీటిని చూసిన చిన్నారులు వివిధ కరెన్సీ నోట్లు, వాటి విలువ, ప్రత్యేకతల గురించి వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నాను.

# హాతవిధీ.. రక్తనిధి

సిరిసిల్ల : జిల్లాలోని వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రికి రక్తనిల్వ కేంద్రం ఉత్తర్వులకే పరిమితమైంది. రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి ఏర్పాటు చేయాల్సి ఉంది. రక్తనిల్వ కేంద్రం ఏర్పాటైతే.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉంటుంది. జిల్లా అంతటికీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే పనులు ప్రారంభం కావాల్సి ఉండగా మూడు నెలలుగా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.జిల్లా ఆసుపత్రి వైద్య కళాశాల స్థాయికి పెరగడంతో దీనిలోని రక్తనిల్వ కేంద్రం రక్తనిధిగా మారింది. అప్పుడే వేములవాడలోనూ ప్రాంతీయ ఆసుపత్రి నూతన భవనం కూడా ప్రారంభమైంది. జిల్లా జనరల్ ఆసుపత్రిలోని రక్త నిల్వ చేసే సామగ్రిని వేములవాడకు తరలిస్తే ఇబ్బంది ఉండేది కాదు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రసవాల్లో శస్త్రచికిత్సలు, జనరల్ సర్జన్లు నిత్యం జరుగుతున్నాయి. అదే విధంగా ప్రమాదాల బారిన పడిన వారికి అత్యవసర చికిత్సలు కూడా అందుతున్నాయి. ఇలా నెలకు సగటున 120 యూనిట్లు పైగా రక్తం అవసరమవుతుంది. రక్తనిల్వ కేంద్రం లేకపోవడంతో జిల్లా ఆసుపత్రికి పరుగు తీయాల్సి ఉంటుంది. అంతేకాకుండా జిల్లాలో ఎక్కడ అవసరమున్నా జిల్లా




జనరల్ ఆసుపత్రికి రావాల్సిందే.

సేకరణ ఇలా...

జిల్లా ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి నెలా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తున్నారు. వేములవాడ ఆసుపత్రిలో రక్త నిల్వ కేంద్రం అందుబాటులోకి వస్తే జిల్లా ఆసుపత్రి నుంచి అవసరాన్ని బట్టి ముందస్తుగా నిల్వ చేసుకునే వీలుంటుంది. అత్యవసర శస్త్రచికిత్సల సమయంలో అక్కడే నిర్ధారణ పరీక్షలు చేసుకుని రోగులకు అందించవచ్చు.

త్వరలో పనులు ప్రారంభం

ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు పెరుగుతున్నాయి. రక్తనిల్వ కేంద్రం అవసరం ఉంది. ఇటీవలే ఆసుపత్రిలోని పలు గదులను పరిశీలించారు. వాటిలో రక్తనిల్వ కేంద్రానికి అనుగుణంగా మార్పులు చేర్పులకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాల్సి ఉంది. దాని తర్వాత పనులు ప్రారంభిస్తారు.సంతోష్, పర్యవేక్షకుడు, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి

## చెత్తవేస్తే పక్కాగా చిక్కేస్తారు

హైదరాబాద్: రాత్రవగానే రోడ్డుపక్కన చెత్త కుప్పలుగా పడుతుంది. చూసేవారు, అడిగేవారు ఉండరనే కారణంతో.. ఇళ్లు, హోటళ్లలోని వ్యర్థాలను రోడ్లపై పడేస్తున్నారు. అలాంటి వారిని క్షణాల్లో గుర్తించే నిఘా వ్యవస్థను ఉప్పల్ సర్కిల్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో మాదిరి కాకుండా ఉపకమిషనర్ జి.ఆంజనేయులు పక్కాగా అమలు చేస్తున్నారు. మనిషి లేదా యంత్రం కదలికలను గుర్తించి, ఆ దృశ్యాలను ప్రత్యేక ఫోల్డర్‌లో భద్రపరిచే సెన్సర్లను సీసీ కెమెరాలకు అమర్చారు. దాంతో చెత్తకుప్పలు పడిన సమయం ఆధారంగా ఉల్లంఘనులను గుర్తించగలుగుతున్నారు. జరిమానా వేయడంతోపాటు కారణాలు విశ్లేషించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. ఈ విధానాన్ని నగరవ్యాప్తంగా అమలు చేయడంపై బల్దియా దృష్టిపెట్టింది.

మార్పు తీసుకొస్తున్నాం.. ఉప్పల్ సర్కిల్‌లో దాదాపు 100కుపైగా



చెత్తకుప్పలున్నాయి. వాటిని సున్నా చేయడమే లక్ష్యంగా మూణ్నెళ్ల క్రితం 23 సీసీ కెమెరాలను అమర్చారు. కేవలం వీడియో రికార్డే కాకుండా మనిషి, వాహనం కదలికలు గుర్తించే కెమెరాలు అమర్చారు. ఎవరైనా చెత్త వేయడానికి వెళ్తుంటే వెంటనే వీడియో రికార్డింగ్ మొదలవుతుంది. ఆయా వీడియోలను ఆ ప్రాంతం పర్యవేక్షకులు, బాధ్యులైన అధికారికి పంపిస్తారు. చెత్త వేసిన వ్యక్తిని తెలుసుకుని, వారింటికి సిబ్బందితోపాటు స్వచ్ఛ ఆటో డ్రైవరును తీసుకెళ్లి.. లోపాలను అక్కడికక్కడే సరిదిద్దుతున్నట్టు ఉపకమిషనర్ 'ఈనాడు'కు తెలిపారు.

రూ.1,20,000 వసూలు..

ఇంట్లోని చెత్తను వీధిలో పడేస్తోన్న 310మందిని గుర్తించామని, వారికి రూ.500, రూ.1000 చొప్పున రూ.1,20,000 వరకు జరిమానా విధించామని అధికారులు తెలిపారు. జరిమానా వేయడమేగాక.. అందుకు కారణమవుతోన్న సిబ్బంది, స్వచ్ఛ ఆటోలపైనా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే హైదరాబాద్ పరిశుభ్రంగా ఉంటుందని డీసీ వివరించారు.

## మూసీ 'దారి'కొచ్చేది ఎప్పుడు..!

నకిరేకల్: మూసీ.. గత రెండుమూడేళ్ల నుంచి నాగార్జునసాగర్ కంటే ముందుగానే నిండుతుంది.. పదేళ్ల నుంచి మండువేసవిలో నిండు కుండలా కనువిందు చేస్తోంది. 65వ నెంబర్ హైదరాబాద్–విజయవాడ, 365 నకిరేకల్– తానంచర్ల జాతీయ రహదారుల మధ్యలో ఉన్న జలాశయం ఇది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న మూసీ ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. నకిరేకల్ సమీపంలో మూసీ నదిపై ఈ ప్రాజెక్టును నిర్మించి ఆరుదశాబ్దాలైనా నేటికి సరైన రోడ్డు సదుపాయం లేదు. మూసీ ప్రాజెక్టు వద్దకు చేరుకునేందుకు నకిరేకల్ నుంచే ప్రధాన రహదారి సౌకర్యం ఉంది. ఇది ఒక్క వరుసతోనే ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నకిరేకల్ నుంచి మూసీ ప్రాజెక్టు 12 కిలోమీటర్లు. ఇరుకు రహదారిపై తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు, ట్రాక్టర్లు అధికంగా బోల్తా పడుతున్నాయి. ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.



దీనిని రెండు వరుసలుగా విస్తరించాలని పదేళ్ల నుంచి స్థానికులు కోరుతున్నారు. ప్రాజెక్టు వద్దకు వచ్చే పర్యాటకులతో పాటు ఈ రోడ్డుపై నకిరేకల్, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు చెందిన 20 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రాజెక్టు, గేట్ల మరమ్మతులకు అవసరమైన భారీ క్రేన్లు, ఇతర వాహనాలు ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఇంత కీలకమైన రహదారి విస్తరణలో దశాబ్దాల తరబడి నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఈ రహదారి పలు చోట్ల ధ్వంసమై గోతుల మయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరేళ్ల క్రితం రూ.10 కోట్లతో దీని విస్తరణకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ఇటీవల మళ్లీ ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నా మూసీ రహదారికి నిధుల ఊసే లేదు.

రూ. 30 కోట్లతో ప్రతిపాదనలు నకిరేకల్– మూసీ ప్రాజెక్టు రహదారి విస్తరణ కోసం రూ.30 కోట్లతో ఐదు నెలల క్రితం ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ నకిరేకల్ ఏఈ సంతోశ్‌కుమార్ తెలిపారు. నకిరేకల్ ప్రధాన కూడలి నుంచి నోముల గ్రామం వైపు మూడ కిలోమీటర్ల మేర ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కూడా ఇదే ప్యాకేజీలో ప్రతిపాదించామన్నారు.

## బోరు నడవకపోతే పంట బేర్

గజ్వేల్: వాతావరణ పరిస్థితులకు వరి పంట ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వర్షాకాలం సీజన్ దసరా పండుగతో దాదాపు ముగిసిపోనుందని వాతావరణ శాఖ విభాగం ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం అక్కడక్కడా అడపాదడపా వానలే కానీ నిరంతరంగా భారీగా కురుస్తున్న దాఖలాలు జిల్లాలో కానరావటం లేదు. మరోవైపు వానకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో 3.68 లక్షల ఎకరాల్లో సాగైన వరి పంట గట్టెక్కేందుకు రైతులు బోరు బావులపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీనికి కరెంటు వినియోగం విపరీతంగా పెరుగుతోంది. గతేడాది ఇదే సీజన్‌తో పోల్చితే వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం సగటున రోజుకు 8 మిలియన్ యూనిట్లు ఉండగా ప్రస్తుతం 9 మిలియన్ యూనిట్లు.. అంటే ఒక మిలియన్ యూనిట్లు ఎక్కువగా వాడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అప్పుడు ఆలస్యంతో ఇప్పుడు పొడిగింపు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. సీజన్ ప్రారంభంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, వర్షాల ఆలంబనతో కర్షకులు ఎక్కువగా వరి సాగు వైపు మొగ్గు చూపారు. సాధారణంగా వానాకాలం సీజన్‌లో వరి నాట్లు పంద్రాగస్టు వరకు పూర్తయితే నవంబర్ చివరి వారంలో నూర్పిళ్లకొస్తాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలు సకాలంలో కురియకపోవటంతో సెప్టెంబరులోనూ నాట్లు వేయాల్సి వచ్చింది. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పంట గొలుసుకట్టు దశలో ఉంది మరికొన్ని చోట్ల కరకు దశలో ఉన్నాయి.

# విద్యార్థులకు పౌష్టికాహారమే లక్ష్యం



కొడంగల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల్లో ఎక్కువ మంది పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారు. ఈ విషయాన్ని పలు సర్వేలు వెల్లడించాయి. పేదరికం కారణంగా ఇంట్లో సరైన ఆహారం లభించక అనేకమంది పాఠశాలల్లో లభించే మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారని అధికారులు గుర్తించారు. అలాంటి వారికి బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో 'అక్షయ పాత్ర' పేరుతో ప్రభుత్వం కొత్త పథకం ప్రారంభించింది. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్' ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ నియోజకవర్గం

పథకం అమలుకు సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకొనే విద్యార్థులందరికీ అల్పాహారం, భోజనం అందిస్తారు. ఇందుకోసం కొడంగల్ పట్టణంలోని వృథాగా ఉన్న సమీకృత మార్కెట్ యార్డులో ఫౌండేషన్ వారు రూ.4 కోట్లతో బాహుబలి కిచెన్ షెడ్డు నిర్మిస్తున్నారు. ఫౌండేషన్ నుంచి రూ.2 కోట్లు, సీఎస్ఆర్ ఫౌండేషన్ నుంచి రూ.2 కోట్లు కేటాయించారు. పనులు అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేస్తారు. ఇప్పటికే కొన్ని అక్షయ పాత్ర వస్తువులు చేరుకొన్నాయి. పైపులైన్‌ల ఏర్పాటు, గ్రానైట్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. భవనానికి ఆరు బయట రంగులు వేస్తున్నారు. 28వేల మందికిపైగా విద్యార్థులకు లబ్ధి నియోజకవర్గంలోని వికారాబాద్ జిల్లాకు సంబంధించి కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలు, నారాయణపేట జిల్లాకు సంబంధించి కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో ఈ పథకం అమలవుతుంది. మొత్తం 312 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు గల 28,000కు పైగా గల విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.

అల్పాహారం, భోజనం అందిస్తాం

హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ పాత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులకు బలవర్ధకమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తారు. తొలి దశలో కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల విద్యార్థులకు సేవలు లభిస్తాయి. ఈ అక్టోబర్‌లో చివరలో అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. వెంకట్రెడ్డి, 'కడా' ప్రత్యేక అధికారి, కొడంగల్.

# కూరగాయల ఖిల్లా.. జేబులు గుల్ల



పరిగి : అసలే పండగల సీజన్. సాధారణ రోజులతో పోల్చితే కాస్త ఖర్చులు ఎక్కువే. ఇలాంటి సమయంలో ఓవైపు నిత్యావసరాలు, మరోవైపు కూరగాయల ధరలు తారా జువ్వల మాదిరి పైపైకి పోతున్నాయి. వీటిని అందుకునే స్థోమత లేక సామాన్యుడి మొదలు ఉన్నతాదాయ వర్గాల వరకు బెంబేలెత్తిపోతున్నారు. దీనికి సంబంధించి కథనం.

రైతులకు చేకూరని ప్రయోజనం

సంవత్సరాలుగా 'కూరగాయల హబ్'గా వికారాబాద్ జిల్లాకు పేరుంది. మొత్తం 20 మండలాల్లో పంటలు సాగవుతున్నాయి. కానీ రైతులకు, వినియోగదారులకు మాత్రం ప్రయోజనం లేకుండా పోతోంది. పండిన పంటను దాచేందుకు సరైన గిడ్డంగులు లేవు. శీతల గిడ్డంగుల ఊసే లేదు. దీంతో రైతులకు కష్టానికి తగిన ఫలితం దక్కడంలేదు. దళారులకు మాత్రం లాభిస్తోంది.

జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో 4904 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగులోకి వచ్చాయి. వెరసి లక్ష టన్నుల ఉత్పత్తి అంచనా. వేసవిలో దాదాపు 9వేల ఎకరాలకు పైగా సాగులోకి వచ్చే అవకాశముంది. స్థానికంగా పండిసున్నా ధరలు దిగిరాకపోవడంతో ఉన్నంతలో సర్దుకుపోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. రూ.50కి ఏవీ తక్కువగా లభించడం లేదని చివరకు ఆకు కూరలు సైతం కిలోకు రూ.40నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు.

ఖరీఫ్ సాగు వివరాలు

కూరగాయలు పండిస్తున్న రైతులు: 5977

సాగు విస్తీర్ణం: 4904.39 ఎకరాలు

దిగుబడి అంచనా: లక్ష టన్నులు

ఏడాదిగా తగ్గడం లేదు

– నర్సమ్మ, గృహిణి, దౌల్తాబాద్

నిత్యావసర సరకుల ధరలకు తోడు కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. సామాన్యులు ఎక్కువగా వాడే టమాట ధర మళ్లీ పెరుగుతూ వస్తోంది. పండగల సమయంలో కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారుతోంది. పేదలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పెరటి తోటలపై దృష్టి సారించాలి– వైజయంతి, ఉద్యానాధికారిణి, పరిగి డివిజన్ ధరల నుంచి పేదలు బయటపడేందుకు పెరటి తోటల పెంపకం ఎంతో మేలు. ఇళ్లముందు ఖాళీ స్థలాలు ఉంటే చాలు రకరకాల కూరగాయలు, చిన్నచిన్న తొట్లలో ఆకు కూరలను పండించుకోవడం అన్ని విధాలుగా కలిసి వస్తుంది. ఇంటి పైకప్పులపైనా సులువుగా సాగు చేసుకోవచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది.

# విస్తరణకు సానుకూలం.. పరిహారంపై అభ్యంతరం



హైదరాబాద్: పాతబస్తీ మెట్రోరైలు మార్గంలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుంది. 500 ఆస్తులకు సంబంధించి ఇప్పటికే రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్లు జారీ చేశారు. మొత్తం 1200 వరకు ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆస్తులున్న బాధితుల్లో కొందరు అభ్యంతరాలు చెబుతుండగా.. ఎక్కువ మంది సానుకూలంగా ఉన్నారని.. త్వరితగతినే ప్రక్రియను పూర్తిచేస్తామని మెట్రోరైలు అధికారులు చెబుతున్నారు.

రూ.60వేల వరకు.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మార్గంలో సేకరించాల్సిన ఆస్తుల యాజమానులు కొందరు చదరపు గజానికి రూ.2 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ ధర చదరపు గజం ధర రూ.26వేలుగా ఉంది. భూసేకరణ చట్టం ప్రకారం నగరాల్లో రెండింతల పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం రూ.52 వేలు అవుతుంది. నిర్మాణానికి, ఇతర ఖర్చులు లెక్కకట్టి రూ.60వేల వరకు పరిహారం ఇచ్చేందుకు మెట్రో సిద్ధమైంది. పాత భవనాలు కావడంతో సానుకూలంగా ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు. పరిహారం విషయంలో అభ్యంతరాలు ఉండటంతో మెట్రో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు నిర్వాసితులతో సమావేశాలు జరిపినట్లు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ అధికారులు చెప్పారు.

100–120 అడుగుల మేర..

జీహెచ్ఎంసీ మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పు ఉండేలా విస్తరణ చేపట్టనున్నారు. స్టేషన్లు నిర్మించే చోట 120 అడుగుల మేర విస్తరిస్తారు. దారుల్‌షిఫా నుంచి శాలిబండ వరకు ప్రస్తుతం రహదారి 50 నుంచి 60 అడుగులు మాత్రమే ఉంది. ఇక్కడ ఒక్కోవైపు 20 నుంచి 25 అడుగుల మేర ఆస్తులను సేకరించాల్సి ఉంది.

శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 80 అడుగుల వెడల్పు రహదారి ఉంది. ఇక్కడ ఇరువైపుల పది అడుగుల మేర విస్తరించాలి. తక్కువ ప్రభావం ఉండటంతో మొదట ఇక్కడి నుంచి సేకరణ ప్రక్రియ చేపట్టారు.

## అవస్థ తీరేలా.. మురుగు వ్యవస్థ

హైదరాబాద్: మహానగరంలో మురుగునీటి వ్యవస్థను గాడిన పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రాజధానితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 7,200 కిలోమీటర్ల పొడవునా కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను రూపొందించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. రెండు రోజుల కిందట కేంద్రంలోని పెద్దలను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టును అమృత్‌లో భాగం చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుపై పరిశీలన చేస్తోంది. దశలవారీగా ఈ ప్రాజెక్టును మొదలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించారు.

సమగ్ర నివేదిక..

ప్రస్తుతం మహానగరంలో 7వేల కిలోమీటర్ల పొడవున డ్రైనేజీ లైను ఉంది. వీటిలో అధిక భాగం 50 ఏళ్ల కిందట నిర్మించివే. దీంతో చిన్నపాటి వర్షానికే మురుగు రోడ్లపై పొంగుతోంది. కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడానికి గత ప్రభుత్వం నివేదికను రూపొందించినా నిధులు లేకపోవడంతో ఆ ప్రాజెక్టు మొదలుకాలేదు. ప్రస్తుతం పాతబస్తీలో రూ.200 కోట్లతో కొత్త డ్రైనేజీల నిర్మాణం జరుగుతోంది. మిగిలిన చోట్ల అలానే వదిలేశారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం



ముంబయికి చెందిన సాహో కన్సల్టెంట్ సంస్థకు డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉండాలన్న దానిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. సదరు సంస్థ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రాజధానిలో మురుగు రోడ్లపైకి రాకుండా ఉండాలంటే బల్దియా పరిధిలో 2,600 కిలోమీటర్ల మేర కొత్తగా డ్రైనేజీ నిర్మించాలని నివేదికలో పేర్కొంది. ఔటర్ వరకు మరో 4,600 కిలోమీటర్ల మేర భూగర్భ డ్రైనేజీతోపాటు మురుగు శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరింది. ఇందుకు రూ.17,212 కోట్ల వ్యయం అవుతుందని అంచనా రూపొందించింది. కేంద్రం నుంచి కొంతమేర నిధులు అందే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. అవసరమైతే ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## కొర్రీలు లేకుంటే కొండంత అండ

పెద్దపల్లి : విత్తనం నుంచి కోత వరకు పంటల సాగులో నానా కష్టాలు పడుతున్న రైతులు చేతికొచ్చిన ధాన్యాన్ని విక్రయించడానికీ అవస్థలు పడాల్సి వస్తోంది. అన్నదాతకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నా మిల్లర్లు, నిర్వాహకుల చేతుల్లో మోసాలు తప్పడం లేదు. రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు, వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వానాకాలం వరి పైర్లు కోత దశలో ఉన్నాయి. దసరా తర్వాత కోతలు ప్రారంభం కానుండగా కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఏటా తూకంలో కోతలు, తేమ పేరిట కొర్రీలతో నష్టపోతున్న నేపథ్యంలో ఈసారైనా ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగాలని రైతులు కోరుతున్నారు. జాప్యంతో నష్టం అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతున్నందున కొనుగోలు కేంద్రాలను ఎత్తయిన ప్రదేశాల్లో నిర్వహించాలి. చాలా చోట్ల స్థల సమస్యతో కల్లాలను లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఏళ్ల తరబడి ఒకరికే బాధ్యతలు అప్పగిస్తుండటంతో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. ధాన్యాన్ని సంచి బరువుతో కలిపి 40.650 కిలోలకు తూకం వేయాల్సి ఉండగా అదనంగా 2 నుంచి 4 కిలోల వరకు వేస్తున్నారు. సకాలంలో ట్రక్‌షీట్లు ఇవ్వకుండా మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. దీంతో డబ్బులు జమ కావడం లేదు.

తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యంతో సంచుల్లోనే మొలకెత్తుతోంది. గన్నీ సంచుల కొరత ఉంది.

అడుగడుగునా మోసం

కొనుగోలు కేంద్రాల్లో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే తూకం వేస్తున్నారు. అయినా మిల్లర్లు తరుగు, తాలుతో కోతలు విధిస్తూ దోచుకుంటున్నారు. సీజన్ మొదట్లో అధికారుల పర్యవేక్షణ బాగానే ఉంటున్నా క్రమంగా తగ్గుతోంది. దీంతో నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను ముంచుతున్నారు. తూకంలోనూ వరుస క్రమం పాటించకుండా పలుకుబడి ఉన్న వారికి పెద్దపీట వేస్తున్నారు. రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండటంతో అకాల వర్షాలకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

సమన్వయ లోపం

ధాన్యం సేకరణలో పౌర సరఫరాలు, జిల్లా సహకార, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల మధ్య సమన్వయం లోపిస్తోంది.

లారీల్లో బస్తాలు నింపే క్రమంలో కొంత ధాన్యం రాలిపోతోంది. మిల్లర్లు తూకం వేస్తుండగా తరుగు వస్తోంది. నాసిరకం గన్నీ సంచులతోనూ రైతులు నష్టపోతున్నారు.

మిల్లులకు తరలించే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

మంథని, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో ధాన్యం సేకరణలో జాప్యం నివారించాలి.

కొర్రీలు విధించిన ధాన్యాన్ని కేంద్రాల నిర్వాహకులు తమ బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు దండుకుంటున్నారు.

మంథని మండలం నాగేపల్లి సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో కోతలు విధించి డబ్బుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారంటూ రైతులు పోలీసులను ఆశ్రయించారు. నాలుగు నెలల తర్వాత డబ్బులో కోతలు విధించి చెక్కులు అందజేశారు.

పెద్దపల్లి మండలం అప్పన్నపేట, రాఘవపూర్ కేంద్రాల్లో ప్రతి సీజన్‌లో ధాన్యం సేకరణ ఆలస్యం అవుతుండటం, రైతులు ఆందోళనకు దిగడం పరిపాటిగా మారింది. ఇక్కడ లోతట్టు ప్రాంతాల్లో కేంద్రం నిర్వహణతో కొద్దిపాటి వర్షానికే ధాన్యం తడుస్తోంది.

గత ఇబ్బందులపై సమీక్షిస్తున్నాంధాన్యం సేకరణలో గతంలో ఎదురైన సమస్యలను సమీక్షిస్తున్నాం. కేంద్రాల నిర్వాహకులపై నిఘా పెంచుతున్నాం. కొన్ని చోట్ల కొనుగోలు బాధ్యతలు కొత్త వారికి ఇవ్వాలని సూచిస్తున్నాం. తూకంలో మోసాలకు పాల్పడుతున్న వేబ్రిడ్జిలను మూసివేసి నోటీసులు ఇస్తున్నాం.

## చర్లపల్లిలో రైళ్ల భద్రతా తనిఖీలు

హైదరాబాద్ : సామర్థ్యానికి మించి రైళ్లు నడపడం, భద్రతా తనిఖీల్లో జాప్యంతో సమయపాలన గాడి తప్పి అనేక రైళ్లు రద్దవుతున్నాయి. నగరంలో భద్రతా తనిఖీలు చేసే పిట్‌లైన్లు ఎక్కువగా లేకపోవడంతోనే రైళ్లు ఆలస్యమవుతున్నాయి. వందల సంఖ్యలో రైళ్లు, లక్షలాది మంది ప్రయాణించే రైళ్ల సమయ పాలన సరిగా ఉండేలా దక్షిణ మధ్యరైల్వే సన్నాహాలు చేస్తోంది.సికింద్రాబాద్, కాచిగూడ, లింగంపల్లి స్టేషన్లలో భద్రతా తనిఖీల కోసం పిట్‌లైన్లు ఉన్నా రాకపోకలు సాగించే రైళ్లను తనిఖీ చేసేందుకు టైమ్‌స్లాట్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజూ 12 రైళ్లలో..సుదూరం వెళ్లే రైళ్లు లేదా 1800 కి.మీ వెళ్లే ప్రతిరైలుకు సేఫ్టీచెక్ తప్పనిసరి. భద్రతను పరిశీలించిన తర్వాతే మరో చోటికి పంపాలన్న నిబంధనలున్నాయి.

ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో పిట్‌లైన్లను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే భావిస్తోంది. ఒక రైలు భద్రతా తనిఖీకి 6గంటల సమయం పడుతుంది. రోజుకు ఒక్కో పిట్‌లైన్‌లో మూడు చొప్పున ప్రతి రోజూ 12 రైళ్లలో భద్రతా తనిఖీలు చేయనున్నారు. 500కిలోమీటర్ల పరిధిలో ప్రయాణించే రైళ్లకు ఓఇఎం (అదర్ ఎండ్ మెయింటనెన్స్) రైళ్లను శుభ్రపరచడం, నీరు, విద్యుత్తు సరఫరా తదితరాలను ఇక్కడే పరిశీలించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాందేడ్, నిజామాబాద్ మీదుగా నగరానికి వచ్చే రైళ్లను మల్కాజిగిరి లోని దయానంద్‌నగర్ స్టేషన్ నుంచి మౌలాలీ మీదుగా చర్లపల్లి



తరలించాలని అధికారులు భావిస్తున్నారు. ఇలా చేయడంతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

ప్రస్తుతం ఆగుతున్న రైళ్లు కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ కృష్ణా ఎక్స్‌ప్రెస్ గుంటూరు ఇంటర్ సిటీ కాచిగూడ–మిర్యాలగూడ పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్) శబరి ఎక్స్‌ప్రెస్ రేపల్లె ఎక్స్‌ప్రెస్ (మధ్యాహ్నం) శాతవాహన కాకతీయ ఎక్స్‌ప్రెస్ పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్)కాచిగూడ, మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ రేపల్లె ఎక్స్‌ప్రెస్ (రాత్రి)

## కబ్జా చెరలో పదెకరాల గొల్లచెరువు

తాండూరు: తాండూరు పట్టణంలోని గొల్ల చెరువు శిఖం భూమిలోని పది ఎకరాలు పూర్తిగా కబ్జాకు గురైందని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు తేల్చారు. ఈమేరకు వారు శాటిలైట్ సర్వే నిర్వహించారు. ఒకప్పుడు తాగు, సాగు నీటికి ఉపయోగపడింది. కాలక్రమంలో ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే శిఖం భూములు ఆక్రమణలకు గురై వర్షాలకు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. గొల్లచెరువులోకి మురుగు నీరు రాకుండా చేసేందుకు ప్రత్యేకంగా కాలువ నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవలే నిధులను మంజూరు చేసింది. వీటి ఆధారంగా కాలువను నిర్మించేందుకు



ఇంజినీర్లు సర్వే చేశారు. ఈ నేపథ్యంలోనే గొల్ల చెరువు శిఖం 10 ఎకరాలకు గురైందని గుర్తించారు. ప్రస్తుతం ఉన్న శిఖంలోకి మురుగు నీరు రాకుండా చుట్టూరా కాలువను నిర్మించి దిగువన ఉన్న కాగ్నానదిలోకి పంపించేందుకు నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ప్రస్తుతానికి అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని ఇళ్ల జోలికి వెళ్లదలచు కోలేదని అధికారులు తెలిపారు.

## తిరస్కరణకు తొందరెందుకు?

హైదరాబాద్ : కొత్త కనెక్షన్ జారీ, యజమాని పేరు మార్పిడి, కేటగిరీ మార్పు వంటి సేవలు అందించడంలో తీవ్ర జాప్యం చేసే విద్యుత్తు పంపిణీ సంస్థ.. వినియోగదారుల దరఖాస్తులను తిరస్కరించడంలో మాత్రం ఎక్కడ లేని తొందర ప్రదర్శిస్తోంది. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తుల్లో ఏవైనా పత్రాలు తక్కువ ఉంటే తిరస్కరిస్తున్నారు. చాలావరకు వినియోగదారుల సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. వెబ్‌సైట్‌లో, ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కొందరివి అసంపూర్తిగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వినియోగదారులకు సంక్షిప్త సందేశాలు పంపుతున్నారు. అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసేందుకు గడువు 48 గంటలే ఇస్తున్నారు.




ఎస్ఎంఎస్‌ను కొందరు వెంటనే చూసుకోకపోవడం.. కోరిన పత్రాలను సేకరించేందుకు కొంత సమయం పట్టడం వంటి కారణాలతో గడువులోపు అప్‌లోడ్ చేయలేకపోతున్నారు.

ఎందుకిలా? ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. గడువు లోపల ఎన్ని పరిష్కరించారు..వందశాతం సాధించారా.. లేదా.. అనే గణాంకాలను మాత్రమే సమీక్షల్లో పైఅధికారులు చూస్తున్నారు. దరఖాస్తు పెండింగ్‌లో చూపిస్తే దానికి అధికారులు కారణాలు చెప్పాలి. తమ రికార్డుల్లో గడువులోగా అన్ని కనెక్షన్లు ఇచ్చామని చూపేందుకు ఈ తరహాలో డిస్కం ఆన్‌లైన్ వ్యవస్థ తిరస్కరిస్తోంది. కనీసం పక్షం రోజులైనా గడువు ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు. తిరస్కరించిన తర్వాతనైనా కూడా ఎడిట్ ఆప్షన్ ఇస్తే అందులో పత్రాలను అప్‌లోడ్ చేసేందుకు వీలవుతుంది. దీన్ని పరిశీలించాలని సీఎండీని కోరుతున్నారు.

## ఎన్నెన్నో విశేషాలు.. మిగిలాయి అవశేషాలు





శంషాబాద్ : ఒకప్పుడు 45 చెరువులను నింపి సుమారు 75 వేల ఎకరాలకు సాగునీరందించిన జల్‌పల్లి పరిధిలోని ఫిరంగి నాలా ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది. గత 15 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యానికి గురికావడంతో ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ నాలా వెంట చిన్నాపెద్దా సుమారు 20 వేల ఇళ్లు వెలిశాయంటే పరిస్థితి ఏ స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నాలాను పునరుద్ధరించి జలవనరులను కాపాడాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నాలాను పరిశీలించగా.. అనేక ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేకతలివీ..మూసీ నదికి ఉప నదైన ఈసీ నదికి అడ్డంగా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామ సమీపంలో 1972లో నిజాం ప్రభుత్వం ఆనకట్టను నిర్మించింది.

వరద నీటిని ఇందులోకి మళ్లించే వారు. షాబాద్ మండలంలో ప్రారంభమైన ఫిరంగి నాలా కొత్తూర్ మండలంతో పాటు శంషాబాద్, సరూర్‌నగర్ తదితర మండలాల్లోని సుమారు 45 గొలుసు కట్టు చెరువులను, కుంటలను నింపుకుంటూ చివరిగా ఇబ్రహింపట్నం మండలం పెద్ద చెరువులోకి వరద నీరు ప్రవహించేలా రూపకల్పన చేశారు.నాలా 31 అడుగుల వెడల్పుతో సుమారు 65 కి.మీ మేర నిర్మించారు. 81 ప్రాంతాల్లో నిర్మించిన వంతెనలు, కల్వర్టులు, తూములు, అలుగులు నేటికీ చెక్కుచెదరలేదు.

శంషాబాద్ మండలం పాల్మాకుల్ గ్రామ సమీపంలోని అచ్చంపేట వద్ద అర కి.మీ.కు పైగా 20 ఎడుగుల ఎత్తులో పెద్దపెద్ద బండ రాళ్లతో నిర్మించిన భారీ కట్టడం ఆకట్టుకుంటోంది. దీనిపై నంది విగ్రహాలను ప్రతిష్ఠించడంతో నందుల కత్వ పేరుతో రికార్డుల్లో నేటికి ఉంది.

1908లో హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తిన వరదల్లో నందుల కత్వకు పడిన గండి ఆనవాళ్లు స్పష్టంగా ఇప్పటికీ కనిపిస్తుంటాయి.

కబ్జా కోరల్లో చిక్కి..

శంషాబాద్‌లో విమానాశ్రయం నిర్మించడంతో భూములకు భారీ డిమాండ్ ఏర్పడింది. అనేక గ్రామాల్లో అక్రమంగా లేఅవుట్లు వేసి నాలాను ధ్వంసం చేశారు.

నర్కూడ, ఊట్‌పల్లి తదితర గ్రామాల్లో పట్టా భూమిలో నాలా ఉందంటూ చదును చేశారు. రెవెన్యూ అధికారులు సదరు సదరు వ్యక్తులపై కేసు పెట్టారు.జూకల్ గ్రామంలో ఓ రియల్ వ్యాపారి సుమారు ఒక కి.మీ.కి పైగా నాలాను ధ్వంసం చేసి లేఅవుట్ వేసి ఆక్రమిస్తున్నారు.

షాబాద్ మండలంలో 12 కి.మీ.ల మేర ఉంటే ఆక్రమణకు గురైంది. జల్‌పల్లి, బలాపూర్‌లోనూ అనేక ప్రాంతాల్లో ఈ నాలా కనిపించడం లేదు. శంషాబాద్, తొండుపల్లి, సాతంరాయి తదితర గ్రామాల్లో పూర్తిగా కబ్జా కోరల్లో చిక్కుకుంది. శంషాబాద్‌లో మధురానగర్, ఆదర్శనగర్, ఆర్బీనగర్, మిషన్ కాంపౌండ్ ప్రాంతాల్లో వందల ఎకరాల్లో కాలనీలు వెలిశాయి. సుమారు రెండు కి.మీలకు పైగా నిర్మాణాలు జరిగాయి.

## పర్యావరణం మరింత బలోపేతం



పూడూరు: పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడం కోసం చేపట్టిన 'వన మహోత్సవం' (గతంలో హరిత హారం) పటిష్ఠ అమలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గతంలో నాటి పాడైన వాటి స్థానంలో మొక్కలు నాటేందుకు ఇటీవల 'అమ్మ పేరుతో ఓ మొక్క' అనే కార్యక్రమాన్ని తీసుకు వచ్చారు. అంతేకాదు ఈసారి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు, స్థలాలు, పరిశ్రమల ప్రదేశాలు, రహదారులు, పొలం గట్లు ఇలా పెద్దఎత్తున మొక్కలు నాటడం చేస్తున్నారు. రైతులు ఇష్టపడే నీలగిరి, టేకు వంటి వాణిజ్య మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వటం, పూలు, పండ్ల జాతులు వృద్ధిచేసి అవసరమున్న వారికి అందజేస్తున్నారు.

ఆరు నెలల ముందునుంచే కార్యాచరణ

జిల్లా వ్యాప్తంగా ఈసారి 30 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. గ్రామాల్లో వన మహోత్సవం చేపట్టేందుకు అధికారులు ఆరు నెలల ముందు నుంచే కార్యాచరణ చేపట్టారు. పంచాయతీరాజ్, ఉపాధిహామీ, అటవీశాఖల పర్యవేక్షణలో నర్సరీల్లో మొక్కలు పెంచారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవటంతో ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. ఈసారి గ్రామ పంచాయతీకి ఐదు వేల వరకు మొక్కలు పెంపకం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 566 నర్సరీలు జిల్లాలోని పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలో 566 నర్సరీలు ఏర్పాటుకాగా, పూడూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు పెంచారు. ఉపాధి హామీ కూలీలతో గ్రామాల్లో మొక్కలు నాటాల్సిన చోట గుంతలు తీయించే పనులు జరుగుతున్నా యి. వెంటనే మొక్కలు నాటుతున్నారు. నర్సరీల్లో అలోవేర, దానిమ్మ, కరివేపాకు, రెయిన్ ట్రీ, నీలగిరి, నిమ్మ, ఉసిరి, టేకు, మద్ది, గులాబీ, మందారం, జామ, మామిడి, సీతాఫలం, చింత, కానుగ వంటివి ఉన్నాయి. వీటితోపాటు కొందరు దూరపు ప్రాంతాలలో ప్రైవేటు నర్సరీల నుంచి ఖరీదైన మొక్కలు తెప్పించి నాటిస్తున్నారు. ఈ సందర్భంగా పూడూరు ఏపీఓ రాములుతో మాట్లాడుతూ.. ఇంకా విస్తారంగా నాటాల్సి ఉందన్నారు. పూడూరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటివరకు 90 శాతం మేర మొక్కలు నాటామన్నారు. క్షేత్రసహాయకుల ఆధ్వర్యంలో కూలీలు గుంతలు తీస్తున్నారని, రహదారులతో పాటు ఎక్కడ ఖాళీ స్థలాలున్నా వారు మొక్కలు నాటేందుకు ప్రోత్సహిస్తామన్నారు.

## 'సమీకృతం' అసంపూర్ణం.. సమస్యలు నిత్యకృత్యం

వికారాబాద్ : జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పురపాలికల్లో సమీకృత మార్కెట్ యార్డుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సకాలంలో పూర్తి కాకపోవటంతో రైతులు రోడ్ల పక్కనే కూరగాయలను విక్రయించాల్సి వస్తోంది. తాజాగా శిక్షణ కలెక్టర్ ఉమాహారతి సైతం వికారాబాద్ మార్కెట్ స్థితిగతులను మున్సిపల్ అధ్యక్షురాలు మంజులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కరించాలని ఆమె కోరారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

వారం వారం సంతలు

జిల్లాలో వారానికి ఒక రోజు పట్టణాల్లో సంతలు నిర్వహిస్తారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో సంత కొనసాగుతుంది. సాధారణంగా ప్రతి రోజు 120నుంచి 150 మంది వరకు రైతులు రైతు బజార్‌కు వచ్చి కూరగాయలు, తు కూరలు విక్రయిస్తారు. యార్డుల్లేక రైతుబజార్ ఎదురుగా ఉన్న రోడ్డుపైనే రైతులు కూర్చుని విక్రయిస్తున్నారు.

పరిగిలో నడిరోడ్డుపైనే విక్రయాలు

పరిగి పట్టణంలో రోడ్డు పక్కనే కూరగాయలను విక్రయిస్తున్నారు. ఇక్కడ సమీకృత విపణి నిర్మాణం కోసం రూ.4 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. ఇందుకు గాను 30 గుంటల భూమిని కేటాయించారు. ఈ పనులకు 2022 జూన్ 18న మాజీ మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. పిల్లర్ల వరకు పూర్తి చేశారు. పునాదిలో నాణ్యత లోపం కారణంగా బీటలు కనిపిస్తున్నాయి. కొడంగల్, తాండూరు పట్టణాల్లో విపణి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

నిధులందక నిలిచిపోయాయి

ప్రజలందరికీ ఒకే చోట కూరగాయలు, మాంసం, చేపలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం విపణి నిర్మాణాలను



చేపట్టింది. నిధులు మంజూరు కాక పనులు నిలిచిపోయినట్లు సమాచారం.

వికారాబాద్ పట్టణంలోని రైతు బజార్ పక్కన ఎకరన్నర స్థలంలో నిర్మాణాన్ని చేపట్టారు. ఇందుకు గాను రూ.7కోట్ల20లక్షలు మంజూరు చేశారు. 2022 డిసెంబర్ నెలలో పనులు ప్రారంభించారు. పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 108 దుకాణాలుంటాయి, వీటిలో 60 కూరగాయలు, 30 మాంసం, 18 పూలు పండ్ల విక్రయాలకు కేటాయిస్తారు. కానీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

– జాకీర్ అహ్మద్, పుర కమిషనర్, వికారాబాద్.

వికారాబాద్ సమీకృత మార్కెట్ యార్డును ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారు. యార్డు నిర్మాణ పనులు పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## బుల్డోజర్లు హిమాయత్‌సాగర్ వైపు.. భారీ నిర్మాణాల జాబితాలో ప్రముఖుల ఫాంహౌస్‌లు!

హైదరాబాద్: బుల్డోజర్లు ఇక హిమాయత్‌సాగర్ వైపే సాగనున్నాయి. వారంలో జలాశయంలోని నిర్మాణాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేశారు. జలమండలి, రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్ (పూర్తిస్థాయి నీటి మట్టం) పరిధిలో ఉన్న నిర్మాణాలను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. మొదటి దశలో కొందరు ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాలు ఇందులో ఉన్నట్టు తేలింది.

కాంగ్రెస్ నేతల వంతు: అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలతోపాటు ఇతర పార్టీలు, ప్రముఖుల బంగ్లాలు అందులో ఉన్నాయి. వాటి నుంచి పది భారీ నిర్మాణాలను అధికారులు ఎంపిక చేశారు. అధికార పార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రంతోపాటు ఇతర నేతల ఫామ్‌హౌస్‌లు తెరపైకి వచ్చాయి. ఆయా నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ హద్దు లోపల ఎంత వరకు ఉన్నాయి. బఫర్‌జోన్ లోపల, వెలుపల ఎంత మేర ఉన్నాయనే వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని హైడ్రా కార్యాలయం జలమండలి, రెవెన్యూ అధికారులను ఆదేశించింది. వచ్చే సోమవారానికి నివేదికను పూర్తి చేస్తామని అధికారులు హైడ్రాకు నివేదించారు.



జలాశయాల రక్షణ లక్ష్యం

ఈ నెల 11న గండిపేట జలాశయంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యాపార వేత్తల ఫామ్‌హౌస్‌లు, హెూటళ్లు, క్రీడా ప్రాంగణాలను నేలమట్టం చేశారు. అనంతరం నగరంలోని తమ్మిడికుంటలో నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చింది. ఈర్లకుంట, చింతల్‌చెరువు, తదితర తటాకాల్లోని ఆక్రమణలను తొలగించారు. ఇప్పుడు హిమాయత్‌సాగర్ ఆక్రమణలపైనా దృష్టిపెట్టారు. మొదటి దశలో ఎఫ్‌టీఎల్‌లోని పెద్ద బంగ్లాలను కూల్చుతామని, అనంతరం బఫర్‌జోన్‌లోని కట్టడాలను నేలమట్టం చేస్తామంటున్నారు. జలమండలితోపాటు ఇతర శాఖ అధికారులు క్షేత్రస్థాయి సమాచారంతోపాటు గూగుల్ మ్యాప్‌లతో అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్నారు.

## విద్యుత్తు నియంత్రికలు ఢాం

సిరిసిల్ల : మొన్నటి వరకు ఎండా కాలం వల్ల విద్యుత్తు వినియోగం బాగా పెరిగింది. ప్రస్తుత వానాకాలంలో సరైన వర్షాలు లేకపోవడం వల్ల సాగునీటి కోసం అన్నదాతలు వ్యవసాయ కరెంటు మోటార్లను నిరంతరాయంగా నడుపుతున్నారు. ఫలితంగా విద్యుత్తు నియంత్రికలపై అధికభారం పడుతుండటంతో తరచూ కాలిపోతున్నాయి. దీంతో వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాటి మరమ్మతులు, కొత్త వాటిని అమర్చడంలో సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్)పై ఆర్థికభారం పడుతోంది. కాలం చెల్లినవి ఓవర్‌లోడ్‌ను తట్టుకోలేకపోతున్నాయి. జిల్లాలో సెస్ పరిధిలో వివిధ రకాల సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అందించడానికి మొత్తం 10,508 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు 449 పైగా టాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీటిని పూర్తిగా మరమ్మతు చేయడానికి



ఒక్కో దానికి సుమారు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. నియంత్రికలో కాలిపోయిన భాగాలను బట్టి మరమ్మతు చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో కనెక్షన్లను బట్టి లోడ్‌ను అంచనా వేసి నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా, ఓవర్‌లోడ్ కాకుండా అదనపు నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్రమ కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో జూన్ నుంచి ఆగస్టు వరకు సుమారు 60 విద్యుత్తు నియంత్రికలు కాలిపోయాయి. ప్రస్తుతం సాగునీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో రైతులు ఆటో స్టార్టర్లను ఉపయోగించడం వల్ల ఒక్కసారిగా విద్యుత్తు నియంత్రికలపై భారం పడుతుంది. అలాగే నాణ్యత లేని కరెంటు మోటార్ల వల్ల కూడా కాలిపోతున్నాయి. కారణాలు ఇవీ...నాణ్యత లేని మోటార్లను వాడటం వల్ల ఎక్కువ ఆమ్స్ విద్యుత్తును తీసుకుంటున్నాయి. నియంత్రికల్లో ఎల్‌టీ బుష్‌లు కరిగిపోవడం, హెచ్‌టీ లింకులు విరిగిపోవడం, ఆయిల్ తగ్గిపోవడం, ఫ్యూజులు పోవడం వంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతూ ఏకంగా కాలిపోతున్నాయి.

గాలితో కూడిన వర్షాలకు విద్యుత్తు తీగలు ఒకదానికొకటి రాసుకోవడం, పిడుగుపాటు ప్రభావం కూడా వీటిపై పడుతోంది. చాలా చోట్ల ఏళ్ల కింద అమర్చినవి అధిక భారాన్ని తట్టుకోలేకపోతున్నాయి.

రైతులు వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవడంతోపాటు ఆటో స్టార్టర్లను వినియోగించుకోకుంటే విద్యుత్తు నియంత్రికల జీవితకాలం పెరుగుతుందని సెస్ అధికారులు చెబుతున్నారు.

మరమ్మతులు నిరంతర ప్రక్రియ

సెస్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వినియోగదారులు సెస్‌కు చెల్లించాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించాలి. విద్యుత్తు మరమ్మతులు రోజూ కొనసాగుతూనే ఉంటాయి. ఇది నిరంతర ప్రక్రియ. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వదులు తీగలను సరిచేశాం. వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు ఉంటే సెస్ సిబ్బందిని సంప్రదించాలి. – శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ




# పాలనలో వేగం పెంచేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు

అమరావతి: పాలనలో వేగం పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఆర్థిక, ఆర్థికేతర అంశాలను విభజించి పరిష్కారంపై ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మొత్తంగా 49 అంశాల్లో ఆర్థికేతర సమస్యలను అధికారులు గుర్తించారు. ఆర్థిక పురోగతిలో భాగంగా 24 పాలసీలు రూపొందించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రాభివృద్ధి, విజన్ డాక్యుమెంట్లు, గ్రోత్ పాలసీలో భాగంగా విధాన పత్రాల రూపకల్పన చేయనుంది. ఈ మేరకు ఆర్థికేతర అంశాల పరిష్కారం, పాలసీల రూపకల్పనపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్ని ప్రభుత్వ శాఖలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరభ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 30లోగా తీసుకున్న చర్యలు, పాలసీల రూపకల్పన వివరాలను సమర్పించాలని సీఎస్ ఆదేశించారు. వచ్చే కేబినెట్ భేటీలో ఆర్థికేతర అంశాల పరిష్కారం, విధానాల రూపకల్పనపై చర్చ ఉంటుందని సీఎస్ కార్యాలయం ప్రకటనలో పేర్కొంది.

## దుర్గమ్మ అనుగ్రహంతో ఏపీలో సమగ్రాభివృద్ధి: సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. వరదల వంటి విపత్తు సమయంలో అధికారులు బాగా పని చేశారని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. దుర్గమ్మ అనుగ్రహంతో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.


విజయవాడ కనక దుర్గమ్మను నీతిఆయోగ్ ప్రతినిధుల బృందం దర్శించుకుంది. అమ్మవారికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు సతీసమేతంగా దుర్గమ్మను దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులు వేలాదిగా ఆలయానికి తరలివస్తున్నారు. శనివారం పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

## పంట పండని ప్రాంతంలోనూ కార్లు పరిగెత్తించిన ఘనత సీఎం చంద్రబాబుది: లోకేశ్




మంగళగిరి: పంట పండని ప్రాంతంలోనూ కార్లు పరిగెత్తించిన ఘనత సీఎం చంద్రబాబుదని మంత్రి లోకేశ్ తెలిపారు. మంగళగిరి పరిధిలోని కియా కార్ల షోరూమ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇది ప్రారంభం మాత్రమేనని.. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు వస్తాయన్నారు. కరవు ప్రాంతం అనంత గడ్డ పైకి కియా రావడానికి చంద్రబాబు కారణమని చెప్పారు. "టీసీఎస్‌ను ఒప్పించి పెట్టుబడులు తేవడంతోనే సంతృప్తి చెందలేదు. ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరుతాం. దేశంలో ఎక్కడ కియా కారు కనిపించినా మేడిన్ ఆంధ్రా అంటున్నారు. కియా వల్ల అనంతపురం జిల్లాలో తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది. విజన్ ఉన్న నాయకుడికి.. విజన్ లేని నాయకుడికి మధ్య తేడా గుర్తించాలి. పెద్ద పరిశ్రమలను ఒప్పించి రాష్ట్రానికి తెస్తున్నాం. చిన్న పరిశ్రమలనూ ప్రోత్సహిస్తూ ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నాం" అని లోకేశ్ తెలిపారు. రోజుకు 70 కార్ల సర్వీస్ చేసేలా ఆధునిక వసతులతో ఇక్కడ కియా షోరూమ్ ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవంలో మంత్రులు మండిపల్లి రామ్‌ప్రసాద్, పార్థసారథి, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగులు, బొమ్మలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు: మంత్రి పార్థసారథి




అమరావతి: వంద రోజుల పాలనలో ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ సచివాలయం నాలుగో బ్లాక్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సత్తా చాటేలా ఒకే రోజులో 60 లక్షలకు పైగా పింఛన్లను పంపిణీ చేయించిన ఘనత చంద్రబాబుదే అని తెలిపారు.

గత ప్రభుత్వం అన్నింటి పైనా రంగులు, బొమ్మలు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల సొమ్మును జాగ్రత్తగా కాపాడుతోందని చెప్పారు. "రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకువచ్చి లక్షల మందికి ఉపాధి కల్పించే ప్రయత్నం జరుగుతోంది. పెట్టుబడిదారులు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. గత ప్రభుత్వం మేనిఫెస్టో పేరిట దోపిడీ చేసింది. రూ.10.50 లక్షల కోట్ల అప్పులు చేసింది. అవినీతిని కూడా వ్యవస్థీకృతం చేసిన ఘనత వైకాపాది. లబ్ధిదారులకు ఇచ్చే రూ.2.5 లక్షల గృహ నిర్మాణ వ్యయాన్ని రూ.1.80 లక్షలకు తగ్గించింది కూడా ఆ పార్టీనే. రాష్ట్రంలో అందరికీ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తోంది. సాక్షి పత్రిక కొనుగోలు కోసం గత ప్రభుత్వం నిధులు ఇవ్వడంపై విచారణ జరుగుతోంది. ప్రకటనలు ఒకే పత్రికకు ఇచ్చిన అంశంపై కూడా విచారణ చేస్తున్నాం" అని కొలుసు పార్థసారథి తెలిపారు.

## పవన్ పేరుతో బెదిరింపులు.. కాకినాడ డీఎఫ్‌ఓపై విచారణకు ఆదేశం



అమరావతి: కాకినాడ డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. తన పేరు, కార్యాలయం పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాకినాడ అటవీశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్‌రెడ్డి.. మైనింగ్ వాహనాల విషయంలో కొన్ని రకాల ఆంక్షలు విధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన పేషీలోని ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వారి పేర్లు చెప్పి.. మైనింగ్, అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్టు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎంకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ విచారణకు ఆదేశించారు.

## వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు అస్వస్థత.. జీజీహెచ్‌కు తరలింపు



గుంటూరు: జైలులో ఉన్న వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్ అస్వస్థతకు గురయ్యారు. భుజం, ఛాతీలో నొప్పి వస్తున్నట్లు చెప్పడంతో జైలు అధికారులు ఆయన్ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అరెస్ట్ చేసే సమయంలోనే భుజం నొప్పి ఉన్నట్లు జైలు అధికారులకు సురేశ్ తెలిపారు. వైకాపా అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటిపై దాడి, మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నందిగం సురేశ్ నిందితుడిగా ఉన్నారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో గుంటూరు జైలుకు ఆయన్ను తరలించిన విషయం తెలిసిందే. అక్కడ శుక్రవారం అస్వస్థతకు గురవడంతో పూర్తిస్థాయి వైద్యపరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు.



# తిరుమలలో కనులపండువగా శ్రీవారి మహా రథోత్సవం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం మహా రథోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయజయధ్వానాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో విహరించారు. గోవింద నామస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. శుక్రవారం రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దీంతో వాహన సేవలు పూర్తయ్యాయి. శనివారం చివరి ఘట్టమైన చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే తితిదే ఈవో శ్యామలరావు పరిశీలించారు. భక్తులు ప్రశాంతంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు. పుష్కరిణిలో ఇబ్బంది లేకుండా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది.

26 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. గురువారం శ్రీవారిని 60,775 మంది దర్శించుకున్నారు. 25,288 మంది తలనీలాలు సమర్పించారు. గురువారం తిరుమల శ్రీవారి హుండీకి రూ.3.88 కోట్లు ఆదాయం సమకూరింది.

# దుర్గమ్మకు హంస వాహన సేవ రద్దు



విజయవాడ, అక్టోబర్ 11: దసరా నవరాత్రులు శనివారంతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో చివరి రోజు నిర్వహించే దుర్గమ్మ వారి హంస వాహనం సేవను ప్రభుత్వం రద్దు చేసింది. అమ్మవారి జలవిహారం రద్దు కావడంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. కృష్ణా నదిలో నీటి ప్రవాహ స్థాయి అధికంగా ఉంది. అలాగే ఎగువ ప్రాంతం నుంచి దాదాపు 40 క్యూసెకుల వరద నీరు నదిలో ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో అమ్మ వారి జల విహారాన్ని రద్దు చేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. దాంతో దసరా చివరి రోజు దుర్గా ఘాట్‌లోని గంగా సమేత శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో పూజా కైంకర్యాలను దేవస్థానం అధికారులు నిర్వహించనున్నారు. అందుకోసం దేవాదాయ శాఖతోపాటు నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పనులు చేపట్టారు. ప్రతి ఏడాది దసరా చివరి రోజు... కృష్ణానదిలో అమ్మవారు జల విహారం చేస్తారు. కన్నుల పండువగా జరిగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మ వారి భక్తులు భారీగా విజయవాడ చేరుకునేవారు. అయితే కృష్ణా నదిలో నీటి ప్రవా హం కారణంగా ఈ ఏడాది అమ్మ వారి జలవిహారాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదీకాక ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా విజయవాడకు వరద నీరు పోటెత్తింది. దీంతో విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి.




## టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా నోయల్ టాటా.. రతన్ టాటా పగ్గాలు ఆయనకే

ముంబయి: టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా నోయల్ టాటా నియమితులయ్యారు. రతన్ టాటా తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో ఆయన వారసుడిగా నోయల్ టాటాను ఎంపిక చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈయన రతన్ టాటాకు వరుసకు సోదరుడు అవుతారు.

సవతి తల్లి సిమోన్ టాటా కుమారుడు. ఆయన ఇప్పటికే టాటా గ్రూపులోని పలు కంపెనీల్లో వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టాటా స్టీల్, టైటాన్‌కు వైస్ ఛైర్మన్‌గానూ ఉన్నారు. శ్రీ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులోనూ నోయల్ సభ్యుడిగా ఉన్నారు. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కే అత్యధికంగా 66% వాటా ఉంది. అందువల్ల టాటా టస్ట్స్‌కు ఛైర్మన్ హోదాలో ఉన్న వ్యక్తి.. గ్రూపు కంపెనీల కార్యకలాపాలు, వృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఇప్పటివరకు టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా రతన్ టాటా ఉన్నారు. ఆయన మరణంతో టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ పదవి ఖాళీ అయ్యింది. ఇప్పుడు ఈ బాధ్యతలను నోయల్ టాటాకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పదవి విషయంలో తొలుత వేర్వేరు పేర్లు వినిపించినప్పటికీ.. నొయల్ టాటాకే పగ్గాలు అప్పగించడం విశేషం.

# జగన్‌కు ఆత్మలతో మాట్లాడే అలవాటు ఇంకా పోనట్లుంది..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెడ్ బుక్ యాక్షన్ మొదలైందని, చట్టాన్ని ఉల్లంఘించి ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వాళ్లపై కఠిన చర్యలు ఉంటాయని, చట్టాన్ని ఉల్లంఘించిన బ్యాచ్‌కు రెడ్ బుక్‌లో తమ పేరు ఉందో లేదో అనే కంగారు ఉందని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. యాక్షన్ అయితే అనివార్యమని, వైసీపీ వాళ్లు ఏ పుస్తకం పెట్టుకున్నారో వాళ్లకే స్పష్టత లేదని.. కానీ తన నుంచీ ఇన్స్పైర్ అయ్యారని అర్థమైందన్నారు. రాయలసీమ తయారీ రంగానికి, ఉత్తరాంధ్ర సేవా రంగానికి కేంద్రాలుగా మారనున్నాయని, పరిపాలన ఒకే దగ్గర ఉండాలి, అభివృద్ధి వికేంద్రీకరణ అన్ని ప్రాంతాలకు జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఇప్పుడిప్పుడే పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని, బ్లూ బ్యాచ్ ఆగడాల వల్ల పరిశ్రమల స్థాపనకు ఇబ్బంది అనిపిస్తే ఎంతమాత్రం ఉపేక్షించమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. వరదలొస్తే జగన్‌లా పరదాలు కట్టుకునట్లు.. సీఎం చంద్రబాబు అండ్ టీమ్ ఇంట్లో కూర్చోలేదన్నారు. మాజీ సీఎం జగన్‌కు ఆత్మలతో మాట్లాడే అలవాటు ఇంకా పోనట్లుందని ఎద్దేవా చేశారు. గతంలో ఇలానే ఆత్మలతో మాట్లాడి కియా తమ ఘనతే అన్నారని, ఇప్పుడు టీసీఎస్ గురించి ఏ ఆత్మతో మాట్లాడారని ప్రశ్నించారు. జగన్ హయాంలో తరిమేసిన పరిశ్రమలన్నీ మళ్లీ తెస్తున్నామని.. ఇందుకు లూలూ, అశోక్ లైల్యాండ్ లే ఉదాహరణ అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్ ఇటీవల ముంబైలో టాటా సన్స్ బోర్డు ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ఇరువురు చర్చించారు. ఇంకోవైపు.. హీరానందానీ సంస్థల డైరెక్టర్ హర్ష్ హీరానందానీతో సమావేశం అయినట్లు నారా లోకేశ్ ప్రకటించారు. రాయలసీమలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ఏర్పాటు, విశాఖలో గ్రేడ్ ఏ ఆఫీస్ స్పేస్‌లకు ఉన్న అవకాశాలపై చర్చించానని లోకేశ్ పేర్కొన్నారు కాగా గత వైసీపీ ప్రభుత్వం ప్రచార పిచ్చితో రేషన్ కార్డులను కూడా తమ పార్టీ రంగులతోనే నింపేసింది. వాటిపై ఒకవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి, మరోవైపు జగన్ బొమ్మలు ముద్రించి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు అవుతున్నా ఇప్పటికీ ఆ కార్డులపైనే రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాత రేషన్‌కార్డులను తొలగించి కొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త రేషన్‌కార్డుల రూపకల్పనపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అధికారులు పలు డిజైన్లు పరిశీలిస్తున్నారు. లేత పసుపు రంగుతో, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం ముద్రించిన కార్డుల నమూనాను అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించారు. దాంతోపాటు మరికొన్ని నమూనాలను కూడా ప్రభుత్వ పరిశీలనకు పంపించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం 'వన్ నేషన్ – వన్ రేషన్ కార్డు' నినాదంతో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా అమలు చేస్తున్న స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల వలస కార్మికులు, కుటుంబాలు దేశంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ నేపథ్యంలో స్మార్ట్ రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# ఘాటు ఫోజుల్లో క్యూటీ బ్యూటీ లా!

అవకాశాలు వస్తే ఒకే భాషలో కొనసాగాలి లేదంటే? మల్టీలాంగ్వేజెస్ ని టార్గెట్ చేయాలి. ఇలా చేయగల్గేది అతి కొద్ది మంది భామలే. అందులో సోనాల్ చౌహాన్ అనే యూపీ బ్యూటీ ఒకరున్నారని తప్పక గుర్తించాలి. అవును అమ్మడు కెరీర్ అలాగే ప్లాన్ చేసుకుని ముందుకు తీసుకెళ్తున్నట్లు కనిపిస్తుంది. 'జన్నత్'తో బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై రెయిన్ బో టాలీవుడ్ లోనూ లాంచ్ అయింది. అటుపై నటసింహ బాలయ్య సహకారంతో అతని మూడు చిత్రాల్లో ఛాన్సులందుకుంది. అవిగాక ఇంకొన్ని తెలుగు సినిమాలు చేసింది. కానీ నటిగా ఇక్కడ బిజీ కాలేదు. అదే సమయంలో ఇతర భాషల్లోనూ అంది వచ్చిన అవకాశాలు చేజార్చుకోలేదు.



కోలీవుడ్..బాలీవుడ్ లోనూ సినిమాలు చేసింది. వచ్చిన ఛాన్స్ మిస్ చేయకూడదు అన్న కోణంలో అమ్మడు ఏ భాషని విడిచిపెట్టలేదు. ఇటీవలే బెంగాలీకి వెళ్లింది. అక్కడ డార్డ్ అనే సినిమా చేసింది. ఇలా సోనాల్ కెరీర్ లో గ్యాప్ లు లేకుండా చూసుకుంటుంది. ఆ రకంగా సోనాల్ పదేళ్లకు పైగా జర్నీని దిగ్విజయంగా పూర్తిచేసింది. అలాగే అమ్మడు సోషల్ మీడియాలోనూ అంతే యాక్టివ్ గా ఉంటుంది. కొత్త కొత్త ఫోటోలతో కుర్రకారుని ఆకర్షిస్తుంది.

తాజాగా అమ్మడు మరో హాట్ పిక్ తో నెటి జనుల ముందుకొచ్చేసింది. అమ్మడు డిజైనర్ దుస్తుల్లో స్కిన్ షో హైలైట్ చేసింది. సోనాల్ అలంకరణ, మ్యాకప్ మరింత అందంగా తీర్చిదిద్దాయి. పెదాలపై సన్నని నవ్వు ఫేస్ కి మరింత గ్లోనీ తీసుకొచ్చింది. ఔట్ ఫిట్, చెవి దిద్దులు అంతే ఆకర్షణీయంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది.

## సినిమా హిట్టవ్వాలని ఉపవాస దీక్ష చేపట్టిన ఫ్లాప్ హీరోయిన్!

టాలీవుడ్ లో హీరోయిన్ గా నిలదొక్కుకోవడానికి గట్టిగా ట్రై చేస్తున్న అందాల భామల్లో కావ్య థాపర్ ఒకరు. 2018లో 'ఈ మాయ పేరేమిటో' అనే చిన్న సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. తెలుగులో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అందం, అభినయం రెండూ ఉన్నా సరే, అనుకున్నంత క్రేజ్ తెచ్చుకోలేకపోయింది. అవకాశాలు అందుకుంటోంది కానీ, విజయాలు సాధించలేకపోతోంది. 'ఊరి పేరు భైరవకోన' డీసెంట్ గా ఆడినా, 'డబుల్ ఇస్మార్ట్' మూవీ డిజాస్టర్ గా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'విశ్వం' సినిమాపైనే బోలెడన్ని ఆశలు పెట్టుకుంది కావ్య. గోపీచంద్, కావ్య థాపర్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ "విశ్వం". శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని దసరా పండగ సందర్భంగా థియేటర్లలోకి రావడానికి రెడీ అయింది. అక్టోబర్ 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమా కచ్చితంగా మంచి హిట్ అవుతుందని, తనకు మంచి పేరు



తెచ్చిపెడుతుందని కావ్య నమ్మకంగా ఉంది. విశ్వం సినిమాలో కాస్ట్యూమ్ డిజైనర్ రోల్ ప్లే చేసింది కావ్య థాపర్. ఆమెది మోడ్రన్ గా ఉండే అమ్మాయి పాత్ర. ఆమె క్యారక్టర్ లో కాస్త గ్రే షేడ్ కనిపిస్తుందని టాక్. ఇప్పటి వరకూ సరైన సక్సెస్ రుచి చూడని ఈ బ్యూటీ.. ఈసారి ఎలాగైనా హిట్టు కొట్టాలని స్ట్రాంగ్ గా ఫిక్స్ అయిపోయింది. అందుకే సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించాలని కోరుకుంటూ పూజలు చేయడమే కాదు, ఉపవాస దీక్ష చేపట్టింది. తన లైఫ్ లోనే మొదటిసారిగా నవరాత్రికి సంధర్భంగా తొమ్మిది రోజుల పాటు ఫాస్టింగ్ చేస్తున్నట్లుగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. మరి ఆమె పూజలు ఫలించి విజయ దశమికి మంచి విజయం వరిస్తుందేమో చూడాలి. నిజానికి 'విశ్వం' సినిమా కావ్య థాపర్ తో పాటుగా డైరెక్టర్ శ్రీను వైట్ల, హీరో గోపీచంద్, నిర్మాత విశ్వ ప్రసాద్ కు కూడా కీలకమనే చెప్పాలి. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న గోపీ, హిట్టు కొట్టి మళ్ళీ ట్రాక్ లోకి రావాలని చూస్తున్నారు. దాదాపు ఆరేళ్ల తర్వాత మెగా ఫోన్ పట్టిన శ్రీను వైట్ల.. బ్లాక్ బస్టర్ తో బౌన్స్ బ్యాక్ అవ్వాలని భావిస్తున్నారు. అలానే కమర్షియల్ సక్సెస్ సాధించి లాభాలు వెనుకోవాలని ప్రొడ్యూసర్స్ చూస్తున్నారు. కాబట్టి వీరందరికీ ఈ సినిమా తప్పకుండా హిట్టవ్వాల్సిన అవసరం ఉంది. ఇకపోతే టాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షించడానికి, కావ్య థాపర్ తెలుగు భాష మీద పట్టు సాధించడానికి కష్ట పడుతోంది. టీచర్ ను పెట్టుకొని తెలుగు నేర్చుకుంటోంది. 'విశ్వం' సినిమా రిలీజ్ అవ్వకముందే అమ్మడు మరో మూడు కొత్త ప్రాజెక్ట్స్ కు సైన్ చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే వీటికి సంబంధించిన వివరాలు వెల్లడి కానున్నాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది.




# 'నరుడి బ్రతుకు నటన' ట్రైలర్.. ఎలా ఉందంటే?




మజిలీ, వకీల్ సాబ్ వంటి సినిమాల్లో చిన్న పాత్రలతో కనిపించి మెప్పించిన నటుడు శివకుమార్ రామచంద్రవు.. ఇండస్ట్రీలో తనకంటూ మంచి పేరు సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన హీరోగా నరుడి బ్రతుకు నటన మూవీ రూపొందుతోంది. కేరళ బ్యాక్ డ్రాప్ లో యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్, సుకుమార్ బొరెడ్డి, సింధు రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నరుడి బ్రతుకు నటన నుంచి ఫస్ట్ లుక్, గ్లింప్స్ ను రిలీజ్ చేశారు మేకర్స్. గ్లింప్స్ చూస్తున్నంతసేపు కేరళను అలా చుట్టి వచ్చినట్టు అనిపించిందని, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నట్టుగా ఫీల్ అయినట్టు అనిపించిందని నెటిజన్లు కామెంట్స్ పెట్టారు. తాజాగా థియేట్రికల్ ట్రైలర్ ను మేకర్స్ విడుదల చేశారు. నటి, నిర్మాత మెగా డాటర్ నిహారిక చేతుల మీదుగా ఆవిష్కరించారు. సవాళ్లు, బాధలు, ఎదురుదెబ్బలతో నిండిన ప్రతి ఒక్కరి జీవిత కథ అంటూ పోస్ట్ చేశారు. ఒంటరిగా ఉన్న నీ చెల్లిపై రేలిప్ చేశాడు.. నీ రియాక్షన్ ఏంటి అన్న సీన్ కు యాక్షన్ చేయమంటే హీరో.. కరెక్ట్ గా చేయడు. దీంతో అంతా హేళన చేస్తారు. ఆ తర్వాత హీరోను జాబ్ చూసుకోమంటాడు తండ్రి. అలా కేరళ వెళ్లగా ఫ్రెండ్ పరిచయమవుతాడు. అతడి చెల్లిని ప్రేమించగా.. ఆమె బ్రదర్ అని పిలుస్తుంది. ఆ తర్వాత ట్రైలర్.. ఎమోషనల్ మోడ్ లోకి వెళ్లిపోయింది. మొత్తంగా ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. విజువల్స్ ఫుల్ నేచరుల్ గా ఉన్నాయి. ఫస్ట్ గ్లింప్స్ కు మించి ఆకట్టుకుంటున్నాయి. అచ్చం కేరళలో ఉన్నట్లే అనిపిస్తుంది. శివకుమార్ రామచంద్రపు సహా పలువురి యాక్టింగ్ చాలా బాగుంది. NYX లోపేజ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. మొత్తానికి ట్రైలర్.. సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తోంది. అంచనాలు పెంచుతోంది. అయితే రిలీజ్‌కు ముందే నరుడు బ్రతికే నటన సినిమాను పలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ లో స్క్రీనింగ్ చేశారు. ఇప్పటి వరకు అరవైకి పైగా అంతర్జాతీయ అవార్డులను మూవీ గెలుచుకున్నట్లు నిర్మాతలు తెలిపారు. సినిమాలో నితిన్ ప్రసన్న, శృతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కంటెంట్ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ తో రూపొందిన ఆ సినిమాను అక్టోబర్ 25వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరి ఎలాంటి హిట్ అవుతుందో చూడాలి.

# లేడీ కాప్‌ని ఇలా ఊహించలేదు



సింగం ఫ్రాంఛైజీ సినిమాలకు ప్రత్యేకించి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తమిళ దర్శకుడు హరి రూపొందించిన సౌత్ ఫ్రాంఛైజీ సింగం కి రీమేక్ వెర్షన్ లను తెరకెక్కించడంలో రోహిత్ శెట్టి ఎంతో పాపులరయ్యారు. సింగం థీమ్ తీసుకుని హిందీలో కొత్త కథల్ని రాస్తున్నాడు శెట్టి. పూర్తిగా బాలీవుడ్ నటీనటులతో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. సింఘం ఎగైన్ త్వరలో విడుదల కానుంది. ఇది సూపర్-హిట్ ఫ్రాంచైజీ లో మూడో భాగం. సింగం, సింగం 2, సింబా, సూర్యవంశీ లాంటి విజయవంతమైన చిత్రాలను రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ లో అందించాడు. ఈ యూనివర్శ్ లో సింగం ఎగైన్ ఐదవ భాగం. అంటే ఫ్రాంఛైజీలో మూడోది అయినా యూనివర్శ్ లో ఐదవది. ఇటీవల ట్రైలర్ విడుదలైంది. కానీ ఈ ట్రైలర్ కి మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. పోలీసులు ఒకరికి మించి ఎక్కువమంది కనిపించడమే గాక, వారంతా పాపులర్ స్టార్లు కావడంతో కొంత గందరగోళం నెలకొంది. అలాగే సింగం ఎగైన్ లో దీపికా పదుకొణె లుక్, యాసపైనా నెటిజనులు సెటైర్లు వేస్తున్నారు. పంచ్ లు విసురుతున్నారు. అజయ్ దేవగన్, కరీనా కపూర్, రణవీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్ సహా పలువురు స్టార్లు ట్రైలర్ లో కనిపించగా, దీపిక పాత్రను ఎలివేట్ చేసిన తీరు విమర్శలకు తావిచ్చింది. దీపికా పదుకొనే కాప్ అవతార్ ని 'క్రింజ్' అని కామెంట్ చేసారు. శక్తి శెట్టి అనే కాప్ గా కనిపించే దీపిక పవర్‌ఫుల్‌గా కనిపిస్తుందని అంచనా వేసిన వారు నిరాశపడ్డారు. తన భాష యాస నెటిజనులకు అంతగా నచ్చలేదు. దీంతో ట్రోలర్లు విరుచుకుపడుతున్నారు. రణవీర్ సింగ్ లాగా మారిందని ఒక నెటిజన్ వ్యాఖ్యానించగా, ఈ ట్రైలర్‌కు ఇంటర్వెల్ బ్రేక్ లా మారిందని మరొకరు కామెంట్ చేసారు. అలాగే నయనతార కాప్ లుక్ తో పోలిక చూపిస్తూ కొన్ని ఫోటోలను కూడా నెటిజనులు షేర్ చేసారు. ప్రస్తుతం ఇవన్నీ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి.

# ఒకే హ్యాట్ కింద ఇద్దరు మిత్రులు

రకుల్ ప్రీత్ సింగ్- ప్రగ్య జైశ్వాల్ స్నేహం గురించి తెలిసిందే. ముంబైలో ఈ భామలిద్దరి స్నేహం ఎప్పుడూ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తూనే ఉంది. ఆ ఇద్దరూ కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా ఒకరితో ఒకరు ఎక్కువ సమయం గడిపేందుకు ఆసక్తిగా ఉన్నారు. ప్రతిసారీ పార్టీలు, వేడుకల్లో తప్పనిసరిగా కలిసే ప్రత్యక్షమవుతున్నారు. ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ 34వ పుట్టినరోజు సందర్భంగా ప్రగ్య ఒక అందమైన ఎమోషనల్ నోట్ తో విషెస్ తెలియజేసింది. ప్రగ్య రాసిన నోట్ సారాంశం ఇలా ఉంది. పుట్టినరోజు శుభాకాంక్షలు సన్‌షైన్ రకుల్ ప్రీత్.. నువ్వే మా జీవితాలకు వెలుగు..మీకు ప్రేమ, అంతులేని నవ్వు, గొప్ప ఆహారం, అందమైన ప్రయాణాలు, అద్భుతమైన పని %ఢ% మాతో కొన్ని సూపర్ సరదా సమయాలు ఉండాలని కోరుకుంటున్నాను అని రకుల్ విష్ చేసింది. లవ్ యు టు ది మూన్ %ఢ% బ్యాక్.. అందరి అభిమానం! అంటూ ఎమోషనల్ టచ్ ఇచ్చింది. ప్రగ్య బీచ్ వెకేషన్ నుంచి షేర్ చేసిన హోలి ఫోటోగ్రాఫ్స్ వైరల్ గా దూసుకెళుతున్నాయి. ఓ ఫోటోగ్రాఫ్‌లో



రకుల్ హ్యాట్ ధరించి కనిపించింది. ఆ ఇద్దరూ బ్లాక్ షేడ్స్ లో స్టైలిష్ గా ఫోజులిచ్చారు. ఒకే హ్యాట్ కింద రకుల్-ప్రగ్య జోడీ నవ్వులు చిందిస్తూ ఫోజులివ్వడం ఎంతో అందంగా కుదిరింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో స్పీడ్ గా వైరల్ అవుతోంది. అక్టోబర్ 10, గురువారం నాడు రకుల్ ప్రీత్ సింగ్ తన 34వ పుట్టినరోజును జరుపుకుంటున్న ఈ ప్రత్యేక సందర్భంలో, ఆమె భర్త జాకీ భగ్నాని వారి జీవితంలోని ముఖ్యమైన మూవ్ మెంట్స్ కి సంబంధించిన ఆకట్టుకునే వీడియోను షేర్ చేసారు. దీనికి జాకీ అందమైన క్యాప్షన్ ఇచ్చారు. బీవీ నం.1 (రకుల్ ని అలా పిలుస్తాడు) తనను సజీవంగా ఉన్న అత్యంత సంతోషకరమైన వ్యక్తిగా ఎలా చేసిందో హైలైట్ చేస్తూ నోట్ రాసాడు. జాకీ వారి ఫోటోషూట్‌లు, ఈవెంట్‌లు వివాహం, వివాహానంతర విహారయాత్రల నుండి చక్కగా రూపొందించిన ఫోటోల కోల్లెజ్‌ను షేర్ చేసారు. రకుల్ ఇటీవలే భారతీయుడు 2లో కనిపించింది. తదుపరి దే దే ప్యార్ దే 2లో అజయ్ దేవగన్‌తో స్క్రీన్ స్పేస్‌ను పంచుకోనుంది. అన్షుల్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. %ట%-సిరీస్ - లవ్ రంజన్‌ల మద్దతుతో ఈ చిత్రం 1మే 2025న థియేటర్లలోకి రానుంది.

## సంయుక్త మీనన్.. జాక్ పాట్ కొట్టేసిందిగా..

సౌత్ సినిమా ఇండస్ట్రీలో సంయుక్త మీనన్ తన ప్రత్యేకమైన గుర్తింపును సృష్టించుకుంటోంది. ఇప్పటి వరకు తాను చేసిన పాత్రలతోనే ప్రేక్షకులను మెప్పించిన ఈ అందాల భామ, ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమాతో వస్తోంది. సాధారణంగా గ్లామర్ హీరోయిన్స్ నాయికా ప్రాధాన్యత ఉన్న చిత్రాల వైపు కేవలం తమ కెరీర్‌లో ఒక స్థాయిని చేరుకున్న తర్వాతే మొగ్గు చూపుతారు. అయితే సంయుక్త, తన కెరీర్ ప్రారంభంలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని, ఈ కొత్త ప్రయోగంలోకి అడుగుపెట్టింది. రాజేష్ దండా నిర్మాణంలో హాస్య మూవీస్ పతాకంపై ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమాను రూపొందిస్తున్నారు. రాజేష్ ప్రస్తుతం సందీప్ కిషన్‌తో 'మజాకా' అనే సినిమా తీస్తున్నారు. 'మజాకా' పూర్తయిన వెంటనే సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో రూపొందించే ఈ కొత్త సినిమాను పట్టాలెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి యోగేష్ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం లాంఛనంగా జరగనుంది. సంయుక్త ఈ సినిమా



లో ప్రధాన పాత్ర పోషించనుండగా, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వార్తలు పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి. ఉన్నత స్థాయి కథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సంయుక్త మీనన్ నటనకు మంచి అవకాశం ఉందని తెలుస్తోంది. కథ వినగానే రెండు రోజుల్లోనే సంయుక్త ఈ ప్రాజెక్ట్‌కి ఓకే చెప్పిందట. కథా నేపథ్యంలో కొత్తదనం ఉండటమే కాకుండా, తన పాత్రకు గల ప్రాధాన్యత సంయుక్తను ఆకట్టుకున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 2025 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా కోసం నిర్మాత రాజేష్ దండా భారీ బడ్జెట్ కేటాయించారని సమాచారం. దాదాపు రూ.15 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు నిర్మాత వెనుకాడడం లేదని తెలుస్తోంది. ఒక లేడీ ఓరియెంటెడ్ సినిమాకి ఇంత భారీ బడ్జెట్ కేటాయించడం కొంత అరుదైన విషయం. ఇది చిత్రంపై ఉన్న అంచనాలను మరింత పెంచు తోంది. ఇది మాత్రమే కాకుండా, సంయుక్త ప్రస్తుతం లారెన్స్‌తో ఒక ప్రాజెక్ట్‌లో భాగమైంది.

అలాగే, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న మరో సినిమాలో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రెండు సినిమాల్లోనూ గ్లామర్‌తో పాటు నటనకు పెద్దపీట వేసిన పాత్రలు దక్కించుకోవడం ఆమె కెరీర్‌లో మరొక కీలక మలుపుగా చెప్పవచ్చు.



# గత ప్రభుత్వం 5వేల పాఠశాలలు మూసివేసింది: సీఎం రేవంత్‌రెడ్డి

కొందుర్గ్: తెలంగాణలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వైద్య సదుపాయాలను మెరుగుపరిచి ఆరోగ్య తెలంగాణను ఆవిష్కరిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఒక్కో స్కూల్ భవనాన్ని రూ.25 కోట్లతో 150 ఎకరాల్లో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కొందుర్గులో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. చదువుకున్న విద్యార్థుల కొలువుల గురించి కేసీఆర్ ఎప్పుడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. పేదలంతా గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ బతకాలని కేసీఆర్ భావించారని విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ, ఇది పేదల ప్రభుత్వం. లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు సున్నా సీట్లు వచ్చినా.. వారి ఆలోచనా విధానం మారలేదు. కేసీఆర్ గురుకుల పాఠశాలలకు ఎక్కడా సరైన భవనాలు నిర్మించలేదు. పేద విద్యార్థులు, చదువుకునే బడులు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదు. భారాసకు మాత్రం 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారు. చదువుకునే విద్యార్థులను కూడా కేసీఆర్ కులాల వారీగా విభజించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ వేర్వేరుగా గురుకులాలు పెట్టారు. గత ప్రభుత్వం 5వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో టీచర్లలో అసహనం ఏర్పడింది. ఈ ప్రభుత్వం 21వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చి ఒక నమ్మకం కలిగించింది" అని సీఎం వివరించారు.




లక్ష్మీపురం: కుల, మతాలకు అతీతంగా అందరినీ సమన్వయపరుచుకుంటూ ముందుకెళ్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

ఖమ్మం జిల్లాలోని లక్ష్మీపురంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల వారి కోసం విద్యా బుద్ధులు నేర్పేందుకు నాంది పలికామన్నారు. చదువు, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. "ఈ ఏడాది సమీకృత గురుకులాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.

సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే సాధ్యం కానిదేది లేదు. వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల భవనాలు పూర్తి కావాలి. వీటిలో సకల సౌకర్యాలు పొందుపరుస్తున్నాం. ప్రభుత్వ విద్యావిధానం నిర్వీర్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యాసంస్థల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# తెలంగాణ అంటే ఎందుకంత చిన్న చూపు.. కేంద్రానికి హరీశ్ రావు సూటి ప్రశ్న..



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపిందని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గోదావరి పుష్కరాల నిధుల కేటాయింపు విషయంలో రాష్ట్రాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ట్విటర్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. మొదట్నుంచీ కేంద్రానికి తెలంగాణ అంటే చిన్నచూపే అని హరీశ్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాల వేడుకల నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.100 కోట్లు ఇచ్చిందని, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం గుండు సున్నా మిగిల్చిందని హరీశ్ రావు ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 8మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా.. ఒక్క రూపాయి సాధించలేకపోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధుల కోసం పోరాటం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీలూ నిధుల కేటాయింపుపై మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే లోక్‌సభలో బీఆర్ఎస్ ఉంటే రాష్ట్రానికి అన్యాయం జరిగేది కాదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లోనూ తెలంగాణకు సున్నా కేటాయింపులు చేశారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఆ సమయంలోనూ తెలంగాణ ఎంపీలు నోరు మెదపలేకపోయారని ఆయన ఆగ్రహించారు. ఆంధ్రప్రదేశ్‌కు అడిషనల్ గ్రాంట్ కింద రూ.15,000 కోట్లను ప్రధాని మోదీ ప్రభుత్వం ఇచ్చిందని, కానీ తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేశారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి ఇచ్చారని తమకు బాధలేదని, కానీ తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందనేదే తమ ఆవేదన అని చెప్పుకొచ్చారు. నిధుల కేటాయింపులో కేంద్రం మొదట్నుంచీ తెలంగాణకు మొండి చెయ్యే చూపిస్తోందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. తమ రాష్ట్రం పట్ల ఇంత వివక్ష ఎందుకంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడాలని, హక్కుగా రావాల్సిన నిధులను కచ్చితంగా ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# గ్రూప్-3 అభ్యర్థులకు టీజీపీఎస్సీ కీలక అప్‌డేట్




హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-3 అభ్యర్థులకు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక అప్‌డేట్ ఇచ్చింది. నవంబర్ 17, 18 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని ఇప్పటికే వెల్లడించగా.. తాజాగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. పరీక్షలకు వారం రోజుల ముందునుంచి హాల్‌టికెట్లు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపింది. మోడల్ ఆన్సర్ బుక్‌లెట్లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు టీజీపీఎస్సీ పేర్కొంది.

# హీరో నాగార్జున, కొండ సురేఖ అంశంపై స్పందించిన పీసీసీ చీఫ్

హైదరాబాద్, అక్టోబర్ 11: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్న క్రమంలో హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ వెనక్కి తీసుకున్నారని పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఇష్యూ ఆ రోజే క్లోజ్ అయిందన్నారు. రేవంత్ కేబినెట్ నుంచి కొండా సురేఖను తప్పిస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. ఈ అంశంపై పార్టీ అధిష్టానం సైతం ఎటువంటి వివరణ తమను కోరలేదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కావాలని చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ వైఖరి వల్లే కొండా సురేఖ అలాంటి వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందన్నారు. అయినా ఆమె అలా మాట్లాడాల్సింది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఇదే అంశంలో హీరో నాగార్జున కోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. ఈ కేసులో కోర్టు ఏం చెబుతుందో చూద్దామన్నారు. అలాగే ఫిరోజ్ ఖాన్‌పై ఎంఐఎం దాడి ఘటనపై సైతం పీసీసీ చీఫ్ స్పందించారు. ఎంఐఎంతో స్నేహం వేరు, శాంతిభద్రతలు వేరని ఆయన పేర్కొన్నారు. ఫిరోజ్ ఖాన్‌పై దాడి విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. అయితే దాడుల విషయంలో తమ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అయితే ఇతర పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కొంత ఇబ్బందికర వాతావరణం ఎదురవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో చేరికలకు ప్రస్తుతానికి బ్రేక్ వేశామన్నారు. ఇక దసరా పండగ వేళ.. రెండో విడత కార్పొరేషన్ పదవులు కేటాయించాలని ముందుగా అనుకున్నామన్నారు. కానీ కుదరలేదని చెప్పారు. అయితే దీపావళి లోపు మాత్రం రెండో విడత కార్పొరేషన్ పదవులు కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు.




# దసరా వేళ.. సామాన్యుడు ఉక్కిరి బిక్కిరి

హైదరాబాద్ : దసరా పండగ వేళ.. పాఠశాలలు సెలవులు ఇచ్చేశారు. దీంతో పిల్లలకు ఏదైనా పిండి వంట చేద్దామంటే.. ఆ పరిస్థితులు అయితే ప్రస్తుతం లేవని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పప్పులు ఉప్పులు రేట్లు ఆకాశాన్నంటుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇక వంట నూనెల ధరలు సైతం భారీగా పెరిగి సలసల కాగుతున్నాయంటున్నారు. పోనీలే కూరగాయలు తీసుకు వద్దామని బజారుకు సంచి తీసుకు వెళ్తితే కిలో టమాట ధర రూ. 100. బీర, వంకాయి, బెండా, బంగాళ దుంప తదితర కాయగూరల ధరలు సైతం అదే రేంజ్‌లో ఉన్నాయని పెదవి విరుస్తున్నారు. రూ. 500 కాగితం తీసుకుని కూరగాయల మార్కెట్‌కు వెళ్లితే.. పట్టుమని మూడు రకాలు కాయగూరలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాదు.. ఉల్లి, వెల్లుల్లి, అల్లం ధరలు సైతం ఇదే తరహాలో కొనసాగుతున్నాయని వారు వివరిస్తున్నారు. ఇక దసరా పండగ వేళ.. ఒక్క పచ్చి మిర్చి ధర మాత్రమే తగ్గిందని వారు చమత్కరిస్తున్నారు. కేజీ పచ్చి మిర్చి ధర రూ.30 లేదా రూ.40 మాత్రమే ఉందని వారు వివరిస్తున్నారు. అయితే పచ్చి మిర్చితో ఏ వంటకం చేసుకోలేని పరిస్థితి అయితే నెలకొందని వారు వివరిస్తున్నారు. ఏ వంట వండుకుని తినాలన్నా.. కచ్చితంగా నూనె అవసరమని వారు స్పష్టం చేస్తున్నారు. లీటర్ నూనె ప్యాకెట్ ధర భారీగా పెరిగిందని చెబుతున్నారు. ఈ తరహాలో పప్పులు, ఉప్పులు, నూనెలు ధరలు మండిపోతుంటే.. పేదలు, నిరుపేదలు, మధ్యతరగతి జీవులు బతికేది ఎట్లా అని వారు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది దసరా అయితే వచ్చింది.. కానీ తమకు పండగ మాత్రం రాలేదని వారు క్లియర్ కట్‌గా స్పష్టం చేస్తున్నారు. అన్ని రకాల వంట నూనెలు నిన్న మొన్నటి వరకు తక్కువగానే ఉండేవన్నారు. కానీ నేడు వాటి ధరలు ఒక్కసారిగా పెరిగి పోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇక పండగ వేళ.. సొంత ఊర్లకు వెళ్దామన్నా.. బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు నిండుకున్నాయని వారు పేర్కొంటున్నారు. దీంతో ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తే.. మాత్రం తమకు వీర బాదుడు తప్పదని వారు స్పష్టం చేస్తున్నారు. అయినా ఎన్నికలు అయిపోయాయి.. రాజకీయ పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో తమతో ఇంకా ఈ ప్రభుత్వాలకు ఏం పని అని మధ్య తరగతి జీవులు ఓ విధమైన నిర్వేదంతో ప్రశ్నిస్తున్నారు. ఉచిత పథకాల పేరుతో కొందరికి ఏదో ఒకటి తాయిలంగా ఇచ్చి.. నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెంచడం ద్వారా తమ నడ్డి విరుస్తున్నారంటూ సగటు జీవి ఆవేదనతో కూడిన ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.




**చిట్యాల: నల్గొండ జిల్లా చిట్యాలలో రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీపై ఉన్న డీజిల్ ట్యాంకర్ పేలి భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ బయటకు దూకి ప్రాణాలు కాపాడుకోగా.. లారీ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.**

# మాది చేతల ప్రభుత్వం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి




ఖమ్మం: విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో రాష్ట్ర ప్రజలకు భారాస చేసిందేమీ లేదని విమర్శించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో సమీకృత గురుకుల పాఠశాల భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "పేదల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 28 సమీకృత గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అమ్మ ఆదర్శ పథకం కింద రూ.657 కోట్లు కేటాయించాం.
డీఎస్సీ ద్వారా 11 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. గత ప్రభుత్వం స్కూళ్లు పెట్టిందే తప్ప వసతులు కల్పించడంలో విఫలమైంది. అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత గురుకుల పాఠశాలలకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రూ.125 నుంచి రూ.150 కోట్లతో అద్భుతంగా స్కూళ్ల నిర్మాణం చేపడతాం. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి ప్రజల నెత్తిన భారం మోపింది. ప్రైవేటుకు దీటుగా పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది. మాటలతో కాదు.. చేతలతో చేసి చూపించే ప్రభుత్వం మాది" అని పొంగులేటి అన్నారు.

# విద్యను అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళతాం..




కరీంనగర్ జిల్లా: హుస్నాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ రావడంతో విద్యా రంగంలో హుస్నాబాద్ మరింత ముందుకు తీసుకువెళతామని,.. హుస్నాబాద్ నియోజకవర్గం, కోహెడ మండలం, తంగలపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు భూమి పూజ చేసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగా మీ అందరి ఆశీర్వాదంతో హుస్నాబాద్ ఎమ్మెల్యే అయి మంత్రి అయ్యానని, విద్యా , వైద్యం , టూరిజం, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పన అన్నింటిపై దృష్టి సరించామని చెప్పారు. జీవో 190 ద్వారా నాలుగు గురుకులాలు ఒకే కాంప్లెక్స్‌గా విద్యను అంతర్జాతీయ స్థాయిలో తీసుకుపోవడానికి ఏర్పాటు చేశామన్నారు. నాలుగవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే చదువుకునేల భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. విద్యా శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నప్పటికీ వివిధ విద్యా కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామిని అయ్యానని మంత్రి పొన్నం తెలిపారు. రాష్ట్రంలో 25 వేల పాఠశాలలకు రూ.1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని, స్కూల్స్‌కు ఉచిత విద్యుత్, డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ సిబ్బందికి జీతాలపై ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు19 వేల ప్రమోషన్‌లు, 35 వేల బదిలీలు చేశామని, డీఎస్సీ ద్వారా 10 వేల మందికి నియామక పత్రాలు అందించామని చెప్పారు. గురుకులలో మెస్ బకాయిలు చెల్లించడంతో పాటు, అద్దె బకాయిలు కూడా చెల్లిస్తున్నామని, రూ. 5 వేల కోట్లతో ఈ పాఠశాలల ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. రూ.180 కోట్లతో ఒక్కో పాఠశాల నిర్మాణం జరుగుతుందని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు ఈ పాఠశాల భవనం నిర్మాణం పూర్తి చేస్తామని, అన్ని రకాల వాతావరణానికి తగిన విధంగా ఈ భవన నిర్మాణం జరుగుతుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. అన్ని రకాల వసతులు అంతర్జాతీయ స్థాయిలో కల్పించి తీర్చిదిద్దుతామన్నారు. ఈ ప్రాంతం అంతా ఎడ్యుకేషన్ హబ్‌గా మారాలని.. కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్ ఆ రోజులోనే తెచ్చామని చెప్పారు. ఇన్నోవేషన్ పార్క్ త్వరలోనే భూమి పూజ కార్యక్రమం ఉంటుందని, బస్వపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రంకు స్థల పరిశీలన చేశామని, త్వరలోనే భూమి పూజ కార్యక్రమం చేసుకుంటామన్నారు. సర్వాయి పేటలో టూరిజం హబ్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ. 37 కోట్లు కేటాయించుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com